నేడు రైవాడ ఆయకట్టుకు నీరు విడుదల

దేవరాపల్లి, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : రైవాడ జలాశయం నుంచి ఆయకట్టుకు మంగళవారం నీటిని విడుదల చేస్తున్నట్టు డీఈఈ సత్యంనాయుడు తెలిపారు. మాడుగుల, చోడవరం ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, కేఎస్ఎన్ఎస్ రాజు ముఖ్యఅతిథులుగా హాజరై ఉదయం తొమ్మిది గంటలకు జల హారతి కార్యక్రమం నిర్వహిస్తారని, అనంతరం గేట్లు ఎత్తి కాలువలకు నీరు విడుదల చేస్తారన్నారు. జలాశయం గరిష్ఠ నీటిమట్టం 114 మీటర్లుకాగా ప్రస్తుతం 111.6 మీటర్లు వుందని, ఖరీఫ్‌కు నీటి కొరత వుండదని ఆయన చెప్పారు.

నిబంధనలకు పాతర

రోడ్ల నిర్మాణంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం

- కొరవడిన వీఎంఆర్‌డీఏ అధికారుల పర్యవేక్షణ
- పేదల కాలనీల్లో నాణ్యతా లోపంతో తారు రోడ్ల పనులు
- మూడు నెలలకే పొరలు పొరలుగా లేచిపోతున్న వైనం
- గోతులు పడిన రహదారులతో నివాసితుల ఇక్కట్లు



బీటీ రోడ్డు నిర్మాణంలో నాణ్యత లోపాలకు అద్దం పడుతున్న ఒక రహదారి

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

పేదల ఇళ్ల కాలనీల్లో వసతుల కల్పనలో భాగంగా ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేసి నిర్మిస్తున్న రహదారుల పనుల్లో నాణ్యత లోపించడంతో కొద్ది రోజులకే బీటలు వారి ఛిద్రమవుతున్నాయి. తారురోడ్డుకు కింద వున్న మట్టి, కంకర పైకి తేలుతున్నాయి. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపం, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యమే ఇందుకు కారణమన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గత వైసీపీ ప్రభుత్వం విశాఖ నగరానికి చెందిన పేదలకు స్థలాలు మంజూరు చేసి, పక్కా ఇళ్లు నిర్మించాలని భావించి అనకాపల్లి మండలంలోని 13 గ్రామాల్లో భూ



కుంచంగిలోని పేదల ఇళ్ల కాలనీలో ఛిద్రమైన బీటీ రోడ్డు

సమీకరణ పేరుతో సుమారు 900 ఎకరాలు సేకరించింది. ఈ భూముల్లో సెంటు చొప్పున ఇళ్ల స్థలాల లేఅవుట్లు వేసి అభివృద్ధి చేసే బాధ్యతను వీఎంఆర్‌డీఏకు అప్పగించింది. భూములు ఇచ్చిన రైతులకు ఎకరాకు 18 సెంట్లు చొప్పున అభివృద్ధి చేసిన లేఅవుట్‌లలో స్థలాలు కేటాయించారు. మిగిలిన స్థలాలను పేదలకు అందించి ఇళ్ల నిర్మాణం చేపట్టారు. అనకాపల్లి నుంచి బుచ్చెయ్యపేట వెళ్లే ప్రధాన రోడ్డుకు సమీపంలో కుంచంగి సర్వే నంబర్లు 318 నుంచి 335 వరకు వున్న భూములను అభివృద్ధి చేసి లేఅవుట్లు వేశారు. మౌలిక వసతుల కల్పనలో భాగంగా కాలనీల్లో బీటీ రోడ్లు, సిమెంట్ డ్రైనేజీ కాలువల నిర్మాణం చేపట్టారు. గత ఏడాది ఎన్నికల ముందు రూ.3.28 కోట్ల అంచనాలతో ఒక కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారు. ఎన్నికల కోడ్ అమలులో వున్నప్పుడు పనులు నిలిపేసి, తరువాత కొన సాగించారు. ఎన్నికల సమయం కావడంతో అధికారుల పర్యవేక్షణ కొరవడింది. దీంతో మూడు నెలల్లోనే పనుల్లో నాణ్యత లోపాలు బయటపడ్డాయి. తారు రోడ్లు కుంగిపోయి గోతులు ఏర్పడ్డాయి. కింద వున్న మట్టి, కంకర బయటకు వచ్చేశాయి. రోడ్డు నిర్మాణ సమయంలో సంబంధిత శాఖ ఇంజనీరింగ్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలి. నాణ్యత లోపాలు లేకుండా పనులు చేయించాలి. కానీ వీఎంఆర్‌డీఏ ఇంజనీరింగ్ విభాగం అధికారులు పర్యవేక్షించకుండా కాంట్రాక్టరు ఇష్టానికే వదిలేశారు. దీంతో కాంట్రాక్టర్ తొలుత రెండు పొరలుగా గ్రావెల్ వేసి, రోలింగ్ చేయకుండా తారు రోడ్డు వేశారు. నిబంధనల ప్రకారం మొదట రెండు

... మిగతా 8వ పేజీలో

వైద్య వర్గాల్లో కలకలం

ఎన్టీఆర్ ఆస్పత్రిలో అవినీతి, అక్రమాలపై త్వరితగతిన విచారణకు మంత్రి ఆదేశాలు

- బాధ్యులైన వైద్యులు, సిబ్బందిపై చర్యలు చేపట్టాలి
- రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు డిమాండ్

అనకాపల్లి టౌన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : **స్థానిక జిల్లా కేంద్ర ఆస్పత్రి (ఎన్టీఆర్ వైద్యాలయం)లో గత వైసీపీ పాలనలో జరిగిన అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ చేసిన జారీ చేసిన ఆదేశాలు ప్రభుత్వ వైద్య వర్గాల్లో కలకలం సృష్టించాయి. అప్పట్లో అవినీతి, అక్రమాలకు పాల్పడిన వైద్యులు, సిబ్బందిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని పలు రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు.**

వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత అనకాపల్లిలోని ఎన్టీఆర్ వైద్యాలయంలో పలు అక్రమాలు జరిగాయి. ఇన్‌పెషేంట్ల తప్పుడు లెక్కలు, మందుల వినియోగాన్ని రికార్డుల్లో సక్రమంగా నమోదు చేయకపోవడం, లెసెన్సు లేకుండా క్యాంటీన్ నిర్వహణ, రోజూ ఎంతమంది రోగులకు భోజనాలు సరఫరా చేస్తున్నారో రికార్డుల్లో నమోదు చేయకపోవడం, రోగులకు సరఫరా చేసే ఆహారంలో నాణ్యత లేకపోవడం వంటి ఆరోపణలు వచ్చాయి. వీటిపై అందిన ఫిర్యాదుల మేరకు 2020 ఫిబ్రవరిలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు తనిఖీలు నిర్వహించారు. అప్పటి డీసీహెచ్ఎస్‌తోపాటు తొమ్మిది మంది వైద్యులు, 12 మంది హెడ్ నర్సులు/ స్టాఫ్ నర్సులు అవినీతి, అక్రమాలకు పాల్పడినట్టు ఏసీబీ అధికారుల బృందం గుర్తించింది. వీరిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి నివేదికను సమర్పించింది. అయితే తరువాత నాలుగేళ్లపాటు అధికారంలో వున్న వైసీపీ ప్రభుత్వం.. అక్రమార్కులపై చర్యలు తీసుకోకుండా, ఏసీబీ ఇచ్చిన నివేదికను బుట్టదాఖలు చేసింది. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలనే ఉద్దేశంతో ఐదేళ్ల క్రితం అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయంలో జరిగిన ఏసీబీ తనిఖీలు, అప్పటి ప్రభుత్వానికి సమర్పించిన నివేదికపై వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ దృష్టి సారించారు. వైసీపీ ప్రభుత్వం బుట్టదాఖలు చేసిన ఏసీబీ నివేదికను క్షుణ్ణంగా పరిశీలించారు. అవినీతి, అక్రమాలకు పాల్పడిన 22 మంది వైద్యులు, సిబ్బందిపై శీఘ్రగతిన విచారణ చేయాలని ఆదేశించారు. ఈ విషయం పత్రికల్లో



ఎన్టీఆర్ వైద్యాలయం

ప్రముఖంగా రావడం చర్చనీయాంశంగా మారింది. ఆస్పత్రిలో జరిగిన అవినీతి, అక్రమాలపై పలు రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నేతలు మండిపడుతున్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

సమగ్ర విచారణ చేపట్టాలి

- జి.కోటేశ్వరరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి



అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయంలో వైసీపీ పాలనలో జరిగిన అవినీతిపై సమగ్ర విచారణ జరిపించాలి. అప్పట్లో అక్రమాలకు పాల్పడిన 22 మంది వైద్యులు, నర్సులపై చర్యలు తీసుకోవాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి ఆదేశాలు జారీ చేయడం అభినందనీయం. ఇదే సమయంలో ఆస్పత్రిలో రోగులకు వైద్య సేవలు మెరుగుపరచాలి. వైద్య పరీక్షలతోపాటు స్కానింగ్ సౌకర్యాలు నిరంతరం అందుబాటులో ఉండేలా చూడాలి.

అవినీతిపరులపై చర్యలు చేపట్టాలి

- కొణతాల హరినాథబాబు, ఆమ్ ఆద్మీ పార్టీ



ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజా ప్రతినిధులు పర్యవేక్షణ చేయాలి. ఎన్టీఆర్ వైద్యాలయంలో ఐదేళ్ల క్రితం జరిగిన అవినీతి, అక్రమాలపై ఏసీబీ అధికారులు నివేదికలు ఇచ్చినప్పటికీ అప్పటి ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోలేదు. కూటమి ప్రభుత్వంలో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి స్పందించి శీఘ్ర విచారణకు ఆదేశించడం శుభపరిణామం. అవినీతి, అక్రమాలకు పాల్పడిన వైద్యులు, సిబ్బందిపై శాఖపరంగా చర్యలు చేపట్టాలి.

మంత్రి ఆదేశాలను స్వాగతిస్తున్నాం

- రాజాన దొరబాబు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి



ఎన్టీఆర్ వైద్యాలయంలో ఐదేళ్ల క్రితం జరిగిన అవినీతి, అక్రమాలపై చర్యలకు మంత్రి జారీ చేసిన ఆదేశాలను స్వాగతిస్తున్నాం. ఎన్టీఆర్ వైద్యాలయంలో ఇన్ పేషెంట్ల రిజిస్టర్ సక్రమంగా నిర్వహించేవారు కాదు. మందులను పక్కదారి పట్టించారు. రోగులకు నాణ్యమైన ఆహారాన్ని అందించలేదు. 2020లో ఏసీబీ అధికారులు ఇచ్చిన నివేదికను గత ప్రభుత్వం నాలుగేళ్లపాటు బయటపెట్టకపోవడం శోచనీయం. కూటమి ప్రభుత్వం ఇప్పుడు బయటపెట్టి, చర్యలకు ఉపక్రమించడం మంచి నిర్ణయం

పూడిక తీసి... తుప్పలు తొలగించి..

ఉపాధి నిధులతో బాగుపడిన కల్యాణపులోవ పంట కాలువలు

రెండుచోట్ల అక్విడక్టులకు మరమ్మతు పనులు

- ఆయకట్టు చివరి భూములకు తీరనున్న నీటి కొరత




టి.అర్జాపురం వద్ద కాలువలో పూడిక, తుప్పలు తొలగిస్తున్న ఉపాధి కూలీలు

రావికమతం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): **కల్యాణపులోవ ఆయకట్టుకు సాఫీగా నీరు సరఫరా అయ్యేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రైతుల వినతి మేరకు ఉపాధి హామీ పథకం నిధులతో కాలువల్లో చేపట్టిన పూడిక తీత, తుప్పల తొలగింపు పనులు చివరి దశకు చేరుకున్నారు. ఆగస్టు రెండో వారం నుంచి ఆయకట్టుకు నీటిని విడుదల చేయడానికి సిద్ధంగా వున్నట్టు అధికారులు చెబుతున్నారు.**

కల్యాణపులోవ జలాశయం కింద మండలంలో కల్యాణపులోవ, ములకలాపల్లి, జెడ్.కొత్తపట్నం, గంపవానిపాలెం,జెడ్. జెన్నవరం, కిత్తంపేట, దొండపూడి,కొత్తకోట, మత్స్యవానిపాలెం, ఆర్.కొత్తూరు, మర్రివలస, కన్నంపేట తదితర 16 రెవిన్యూ 16 రెవెన్యూ గ్రామాల పరిధిలో 4,484 ఎకరాల ఆయకట్టు వుంది. మొత్తం 14.5 కిలోమీటర్ల మేర ప్రధాన పంట కాలువ వుంది. పది వరకు పిల్ల కాలువలు వున్నాయి. కాలక్రమేణా పూడిక పేరుకుపోవడంతో 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకం కింద కాలువల్లో పూడిక తీయించింది. మూడేళ్ల వరకు పరిస్థితి బాగానే వుంది. తరువాత నుంచి క్రమంగా పూడిక పెరిగిపోయి, తుప్పలు బలిసిపోయాయి. దీంతో కాలువల్లో నీరు సరిగా ప్రవహించక ఆయకట్టు చివరి భూములకు నీరు అందని పరిస్థితి నెలకొంది. ఈ సమస్యను రైతులు అప్పటి వైసీపీ పాలకుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పూడిక తీయించలేదు. దీనికి తోడు ములకలాపల్లి వద్ద రెండు అక్విడక్టులు శిథిలమై నీరు వృథాగా గెడ్డలోకి పోతున్నది. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ఆయకట్టు రైతులు చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజును కలిసి, సాగునీటి సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. రెండు నెలల క్రితం కాలువలను పరిశీలించి ఆయన ఉపాధి హామీ పథకం కింద రూ.28.5 లక్షలు మంజూరు చేయించారు. ఆయా గ్రామాలకు చెందిన ఉపాధి కూలీలతో కాలువల్లో పూడిక తీత, తుప్పల తొలగింపు పనులు చేయించారు. అక్విడక్టుకు మరమ్మతు పనులు చేపట్టారు. ఇరిగేషన్ ఏఈ డి.సూర్య పర్యవేక్షణలో పనులు శరవేగంగా జరిగాయి. దాదాపు చివరి

... మిగతా 8వ పేజీలో





ములకాలపల్లి వద్ద అక్విడక్టుకు మర్మమతు పనులు చేస్తున్న దృశ్యం. (ఇన్‌సెట్‌లో) మరమ్మతు పనులు చేపట్టకముందు శిథిలస్థితిలో వున్న అక్విడక్టు

డ్రోన్‌తో వరి విత్తనాలు

మెట్టతోపాటు మాగాణి భూములకు అనుకూలం

- 15 నిమిషాల్లో ఎకరా విస్తీర్ణంలో విత్తనాలు వేయవచ్చు
- ఎకరాకు ఎనిమిది కిలోలు చాలు
- సాధారణ పద్ధతితో పోలిస్తే 73 శాతం విత్తన ఖర్చు ఆదా



మెట్ట భూమిలో వరి విత్తనాలు వేస్తున్న డ్రోన్

- అనకాపల్లి ఆర్ఏఆర్ఎస్‌లో శాస్త్రవేత్తల పరిశోధనలు

అనకాపల్లి అగ్రికల్చర్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): వరిసాగులో ఖర్చులతో తగ్గించే క్రమంలో డ్రోన్ల సాయంతో విత్తనాలు వేసే విధానంపై అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో పరిశోధనలు చేపడుతున్నారు. నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో 'డైరెక్ట్ డ్రై సీడింగ్' విధానంలో విత్తనాలు వేయడంపై అధ్యయం చేస్తున్నారు. అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో ప్రాథమికంగా జరిపిన పరిశీలనలో 21 సెంట్ల పొడి (మెట్ట) నేలలో

... మిగతా 8వ పేజీలో



వరి విత్తనాలు వేసేందుకు సిద్ధం చేసిన డ్రోన్



లక్కవరంలో సర్వే రాళ్లను లాటుగా పేర్చిన రెవెన్యూ, సర్వే సిబ్బంది

సర్వే రాళ్లు వీఆర్వోకి అప్పగింత

- 'ఆంధ్రజ్యోతి' కథనంపై స్పందించిన అధికారులు

చోడవరం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): 'ప్రజాధనం రాళ్ల పాలు' పేరిట ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. అనకాపల్లి డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ వెంకన్న ఆదేశాల మేరకు లక్కవరంలో వృథాగా పడిఉన్న సర్వే రాళ్లను సర్వే సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది సహకారంతో లాటుగా పేర్పించి స్థానిక వీఆర్వోకు అప్పగించారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ, ఇతర గ్రామాలకు పంపించవలసిన సర్వే రాళ్లను సిబ్బంది ఇక్కడ నిర్లక్ష్యంగా వదిలేశారని చెప్పారు.

రైల్వే జోన్‌కు రెడ్ సిగ్నల్స్!

మూడడుగులు ముందుకు, ఆరడుగులు వెనక్కి...

- ఇప్పటివరకూ విడుదల కాని గెజిట్
- ముందుకుసాగని పనులు
- జీఎంను నియమించినా కార్యాలయం లేదు
- డీపీఆర్ పంపిన ఆరు నెలలకు తీరుబడిగా కొర్రీలతో ఆమోదం
- రాయగడ డివిజన్‌లోకి అరకులోయ



రైల్వే జోన్‌కు కేటాయించిన స్థలం (ఫైల్ ఫొటో)

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం కేంద్రంగా ప్రకటించిన దక్షిణ కోస్తా రైల్వే జోన్‌ను పట్టాలెక్కించడం రైల్వే పెద్దలకు ఇష్టం లేనట్టుంది. ఇది ఒడిశాకు చెందిన తూర్పు కోస్తా రైల్వే జోన్‌తో ముడిపడి ఉండడం, రైల్వే మంత్రి ఆ రాష్ట్రానికి చెందినవారు కావడమే... అందుకు ప్రధాన కారణమనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఆరేళ్ల క్రితం జోన్‌ను ప్రకటించగా, ఆరు నెలల క్రితం జోనల్ కార్యాలయ నిర్మాణానికి ప్రధాని నరేంద్రమోదీ శంకుస్థాపన చేశారు. అయితే ఇప్పటివరకూ జోన్‌కు సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్‌ను ప్రకటించలేదు. జోన్‌లో డివిజన్లు, వాటి సరిహద్దులు అన్నీ సమగ్రంగా గెజిట్‌లోనే ఉంటాయి. జోన్ ఆపరేషన్ తేదీ కూడా అందులోనే ప్రకటిస్తారు. ఆ గెజిట్ లేకపోవడంతో ఏ పనీ ముందుకుసాగడం లేదు. ఒత్తిళ్లు తట్టుకోలేక విశాఖ కేంద్రంగా జోన్ ఇచ్చారు గానీ పూర్తిస్థాయిలో పనిచేసేందుకు తగిన ఆదేశాలు ఇవ్వడం లేదు. జోన్‌కు జనరల్ మేనేజర్‌ను నియమించారు. ఆయన పరిస్థితి 'రాజ్యం లేని

... మిగతా 8వ పేజీలో

కన్నూరుపాలెం-తోటకూరపాలెం రోడ్డుకు మోక్షం

- రూ.3.82 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం



రూపురేఖలు మారనున్న కన్నూరుపాలెం- తోటకూరపాలెం రోడ్డు

కశింకోట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్ల నుంచి అధ్వానంగా వున్న కన్నూరుపాలెం- తీడ- తోటకూరపాలెం రహదారికి కూటమి ప్రభుత్వంలో మోక్షం లభించింది. సుమారు 5.3 కిలోమీటర్ల దూరం వున్న ఈ రోడ్డు అభివృద్ధికి ప్రభుత్వం రూ.3.82 కోట్లు మంజూరు చేసినట్టు అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామీణ సడక్‌యోజన కింద ఈ రహదారి పనులకు కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు సమకూర్చనున్నట్టు తెలిపారు. త్వరలో టెండర్ల ప్రక్రియ పూర్తిచేసి పనులు ప్రారంభిస్తామని చెప్పారు. కాగా మండలంలో పలు రహదారుల నిర్వహణ పనులకు మరో రూ.22.83 లక్షలు మంజూరయ్యాయని పేర్కొన్నారు.

వరుణుడి కోసం అన్నదాత ఎదురుచూపు

- నీరు లేక దమ్ములు పట్టని రైతులు
- సిద్ధంగా ఉన్న వరినారు
- నిండని చెరువులు.. నదుల్లో స్వల్పంగా నీరు
- నింగి వైపు చూస్తున్న రైతులు



లింగాపురం చెరువులో స్వల్పంగా చేరిన నీరు



బీడు భూములుగా దర్శనమిస్తున్న లింగాపురం పంట పొలాలు

కోటవురట్ల, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులు భారీ వర్షాల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం వర్షాలు అడపా దడపా కురుస్తున్నాయి. మండలంలోని చెరువుల్లో ఆశించిన స్థాయిలో నీరు చేరలేదు. సర్పా, వరహా నదుల్లో నీరు స్వల్పంగా ప్రవహిస్తున్నది. ఈ నదులు వర్షాధారం పైనా ఆధారపడి ఉన్నాయి. జూన్ నెలలో కురిసిన వర్షాలు భూగర్భంలోకి ఇంకిపోయాయి. అంతేగాని చెరువుల్లో, నదుల్లో నీరు నిల్వ ఆశించిన స్థాయిలో చేరలేదు. మండలంలో ఇప్పటికే 90 శాతం మంది రైతులు వరి విత్తనాలు చల్లారు. జూలై నెల చివరి వారం వచ్చినప్పటికీ నదుల్లో స్వల్పంగా నీరు ప్రవహిస్తున్నది. ఈ నదులకు కాలువలు, చెరువులు అనుసంధానమై ఉన్నాయి. నదులు ప్రవహిస్తే గాని కాలువలు, చెరువుల్లోసాగునీరు చేరే అవకాశం లేదు. వరినారు నాట్లుకు సిద్ధంగా ఉంది. కానీ వర్షం కురవకపోవడంతో నాట్లు వేయలేదు. మెట్ట ప్రాంతాల్లో వరినారు వర్షాభావ పరిస్థితుల కారణంగా ఎండిపోయే పరిస్థితులు నెలకొన్నాయి. ప్రస్తుతం పది రోజుల్లో భారీ వర్షాలు కురిస్తే చెరువుల్లో, నదులలో సాగునీరు పుష్కలంగా చేరుతుంది. తద్వారా వరినాట్లు వేసేందుకు అన్నదాతలు ఆశగా ఎదురు చూస్తున్నారు.

ఆర్టీసీ బస్సులు ఆపడం లేదు..

ఎలమంచిలి, పులపర్తి గ్రామాల ప్రజల ఆరోపణ

తరగతులకు అందలేకపోతున్నామని విద్యార్థుల ఆవేదన

ప్రగడ నాగేశ్వరరావు దృష్టికి సమస్యను తీసుకెళ్లిన పలు గ్రామాల ప్రజలు

ఎలమంచిలి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి నుంచి పులపర్తి గ్రామం వరకు జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న గ్రామాల వద్ద ఉన్న రిక్వెస్ట్ స్టాప్‌ల్లో ఆర్టీసీ బస్సులు నిలపడం లేదని పలు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. రిక్వెస్ట్ స్టాపుల వద్ద బస్సులు నిలపకపోవడంతో తరగతులకు అందడం లేకపోతున్నామని కళాశాలలు, పాఠశాలల విద్యార్థులు వాపోయారు. మర్రిబంద, కొత్తలి, రేగుపాలెం, నాయనమ్మపాలెం తదితర పలు గ్రామాల ప్రజలకు ఈ ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారంటున్నారు. రేగుపాలెం జంక్షన్ వద్ద పూర్తిగా బస్సులు నిలపడం లేదని, కొందరు బస్సు డ్రైవర్లు ఇష్టానుసారంగా నిలుపుతున్నారని పలువురు వాపోతున్నారు. పురుషోత్తపురం, పోతిరెడ్డి గ్రామాల మధ్య ఉన్న కొత్తలి రిక్వెస్ట్ స్టాప్ వద్ద బస్సులు నిలపకపోవడంతో 3 గ్రామాల ప్రజలు అవస్థలకు గురవుతున్నామని అంటున్నారు. ఆదివారం కొత్తలి గ్రామాన్ని సందర్శించిన ఏపీఆర్‌డీఎస్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు దృష్టికి స్థానికులు ఈ సమస్యను తీసుకెళ్లారు. ఆర్టీసీ ఉన్నతాధికారులు గ్రామీణ ప్రజల ఇబ్బందులను గుర్తించి రిక్వెస్ట్ బస్టాప్‌లు వద్ద బస్సులు నిలిపేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఎలమంచిలి నియోజకవర్గ యువతకు ప్రత్యేక శిక్షణ

ఎంఎస్ఎంఈ మంత్రిని కోరిన రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు



మంత్రి శ్రీనివాస్‌తో మాట్లాడుతున్న ప్రగడ నాగేశ్వరరావు

అచ్యుతాపురం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం సెజ్‌లో గల ఎంఎస్ఎంఈలో స్థానిక యువతకు శిక్షణలో అధిక ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు ఎంఎస్ఎంఈ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ని కోరారు. సోమవారం విశాఖలో మంత్రి శ్రీనివాస్‌ని ప్రగడ మర్యాదపూర్వకంగా కలిశారు. అచ్యుతాపురం సెజ్‌లో కూటమి ప్రభుత్వం రాకతో మరిన్ని పరిశ్రమలు రావడానికి సిద్ధంగా ఉన్నాయని, సెజ్ నిర్వాసితుల పిల్లలతో పాటు స్థానికులకు ఇక్కడ కర్మాగారాలకు ఉపయోగపడే కోర్సుల్లో ప్రత్యేక శిక్షణనివ్వాలని ప్రగడ కోరారు. ప్రత్యేక శిక్షణనిస్తే ఇక్కడున్న యువత పరిశ్రమలు స్థాపించే స్థాయిలో కూడా ఉన్నారని మంత్రికి వివరించినట్టు చెప్పారు. దీనిపైమంత్రి శ్రీనివాస్ సానుకూలంగా స్పందించారని ప్రగడ నాగేశ్వరరావు తెలిపారు.

హైస్కూళ్లలో విద్యాశక్తి పథకానికి శ్రీకారం

- విద్యార్థులకు ఐఐటీ ప్రొఫెసర్ల బోధన



ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్న దృశ్యం

నక్కపల్లి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినదొడ్డిగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు విద్యాశక్తి కార్యక్రమానికి ప్రభుత్వ శ్రీకారం చుట్టింది. మద్రాసు ఐఐటీ ప్రొఫెసర్లతో ప్రత్యేక బోధన తరగతులు నిర్వహించేందుకు గత సంవత్సరం ఒప్పందం కుదుర్చుకుంది. ప్రస్తుతం విద్యా సంవత్సరం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 5 వేల పాఠశాలల్లో అమలుకు చర్యలు చేపట్టింది. ప్రతిరోజూ బడి ముగిసిన తరువాత ఐఎఫ్‌పీ పటేల్ ద్వారా సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు జూమ్ ద్వారా ఆన్‌లైన్‌లో గణితం, సైన్స్, ఇంగ్లీషు సబ్జెక్టులు బోధన చేస్తారు. అంతేకాకుండా కెరీర్ గైడెన్స్ వ్యక్తిత్వ వికాసం యోగాపై కూడా తరగతులు నిర్వహిస్తారు. సోమ, మంగళ, బుధవారాలు 6,7 తరగతులకు లెక్కలు, సైన్స్, ఇంగ్లీషు బోధన చేస్తారు. గురు, శుక్ర, శనివారాలు లెక్కలు, సైన్స్ ఇంగ్లీషు సబ్జెక్టులను మద్రాసు ఐఐటీ వెబ్‌నారు ద్వారా విద్యార్థులకు చూపించి ప్రత్యేక బోధన చేస్తున్నారు.

జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు శ్రీప్రకాష్ విద్యార్థుల ఎంపిక



జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో నిర్వాహకులు

పాయకరావుపేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి):తెలంగాణలో ఇటీవల జరిగిన సీబీఎస్ఈ క్లస్టర్-7 కబడ్డీ పోటీల్లో పాయకరావుపేట శ్రీప్రకాష్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబర్చి ప్రథమ స్థానంలో నిలిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. సోమవారం విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాష్ అందజేసిన వివరాలిలా ఉన్నాయి. ఈనెల 25 నుంచి 27వ తేదీ వరకు కరీంనగర్‌లో జరిగిన సీబీఎస్ఈ క్లస్టర్-7 కబడ్డీ పోటీల్లో అండర్-14, అండర్-19 విభాగాల్లో తమ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాలు, నగదు బహుమతులు సాధించారన్నారు. దీంతో సెప్టెంబరు 13 నుంచి 16వ తేదీ వరకు బీహార్‌లో జరిగే జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారని ఆయన తెలిపారు. కాగా ప్రతిభ కనబర్చిన విద్యార్థులను విద్యా సంస్థల అధినేత సీహెచ్‌వీకే.నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాష్, సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్.మూర్తి, వైస్ ప్రిన్సిపాల్ ఎం.అపర్ణ, కోచ్‌లు లక్ష్మణ్, చినరాజు, తదితరులు అభినందనలు తెలిపారు.

జడ్.చింతువా అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం, నిత్యావసర వస్తువులు అందజేస్తున్న టీడీపీ మండల అధ్యక్షుడు భరత్, నేతలు

రాంబిల్లి, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జడ్.చింతువా పంచాయతీ గజిరెడ్డిపాలెంలో జరిగిన అగ్నిప్రమాదంలో పూరిల్లు కాలిపోయి రోడ్డున పడ్డ బాధిత కుటుంబాన్ని సోమవారం టీడీపీ మండల అధ్యక్షుడు లాలం భరత్, ఆ పార్టీ నేతలతో కలిసి పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబానికి ఆర్థిక సాయంతోపాటు నిత్యావసర వస్తువులను అందజేశారు. ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం అందజేస్తామని నేతలు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎరిపిల్లి చిట్టిబాబు, చెల్లూరి నూకన్న, ఎరిపల్లి అజయ్, చెల్లూరి ఆనంద్, లాలం అభిరామ్, కారే రాముడు, వాద్ర వెంకటరావు,చేపల రాము, తదితరులు పాల్గొన్నారు.

పాల్తేరు పొలాలకు పుష్కర కాలువ నీరు

మాజీ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడిని కోరిన పాయకరావుపేట సొసైటీ చైర్‌పర్సన్ రాజుబాబు



యనమలను సత్కరిస్తున్న దేవవరపు రాజుబాబు, తదితరులు

పాయకరావుపేట రూరల్, జూలై 28(ఆంధ్రజ్యోతి): పాయకరావుపేట సొసైటీ చైర్‌పర్సన్ దేవవరపు రాజుబాబు సోమవారం తేటగుంటలోని టీడీపీ క్యాంపు కార్యాలయంలో మాజీ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పాల్తేరు గ్రామానికి పుష్కర కాలువ ద్వారా సాగు నీరందించాలని వినతిపత్రం అందించారు. పాల్తేరు సమీపంలోని తుని మండలం వల్లూరు గ్రామం వరకు పుష్కర కాలువ నీరు వస్తుందని, దానిని పాల్తేరు వరకు పొడిగించాలని కోరారు. పాల్తేరుకు ఇటు తాండవ నీరందక, అటు పుష్కర నీరందక రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనిపై యనమల సానుకూలంగా స్పందించినట్టు దేవవరపు రాజుబాబు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు మాకినీడి చిట్టిబాబు, ఉప సర్పంచ్ దేవవరపు శివరాజు, టీడీపీ నాయకులు కొంకిపూడి రమేశ్, సిద్దా సుబ్రహ్మణ్యం, కడింపల్లి కన్నారావు, పినపాల దొరబాబు, కోడా గోపి తదితరులు పాల్గొన్నారు.

కంటోన్మెంట్‌లో రోడ్డుపైకి మురుగు నీరు



కంటోన్మెంట్ ఏరియాలో కాల్వ నిండిపోయి రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

పాయకరావుపేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి):స్థానిక కంటోన్మెంట్ ఏరియాలోని పలు వీధుల్లోని కాలువల మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాయకరావుపేట మెయిన్‌రోడ్డులో మంగవరం రోడ్డు జంక్షన్ నుంచి పిల్లిమదుం వరకు రోడ్డు ఇరువైపులా ఉన్న పలు కాలనీల కాలువల అవుట్‌లెట్లను ప్రధాన కాలువలకు అనుసంధానం చేశారు. ప్రధాన కాలువల్లోకి రోజూ వచ్చే మురుగు నీరు పట్టణంలో పిల్లిమదుం వద్ద నేరెళ్ల కాలువకు చేరుతుంది. అయితే నేరెళ్ల కాలువలో ఈ ఏడాది పూడిక తీయకపోగా.. మెయిన్‌రోడ్డు ఇరువైపులా ఉన్న ప్రధాన కాలువలపై షాపుల యజమానులు పలుచోట్ల సిమెంట్ దిమ్మలు ఏర్పాటు చేసి పూర్తిగా మూసివేశారు. దీంతో ప్రధాన కాలువల్లో ఎక్కడికక్కడ చెత్త, పూడిక పేరుకుపోయి మురుగు నీరు పోయేందుకు మార్గం లేకపోవడంతో రోడ్డుపై ప్రవహిస్తోంది. గత కొద్ది రోజులుగా ఇదే పరిస్థితి ఉన్నా పట్టించుకున్నవారు లేరని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి మెయిన్‌రోడ్డుకు ఇరువైపులా ఉన్న ప్రధాన కాలువల్లో పూడిక తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కాలువ పూడిక తొలగింపును అడ్డుకున్న వ్యక్తిపై చర్యలకు డిమాండ్



తహశీల్దారుకు ఫిర్యాదు చేస్తున్న గోపాలపట్నం రైతులు

పాయకరావుపేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపాలపట్నం వద్ద పాటికాలువలో పూడిక తొలగింపు పనులను అడ్డుకుంటున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఆయకట్టు రైతులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం తహశీల్దారు మహేశ్వరరావు, సీఐ జి.అప్పన్న, ఇరిగేషన్ అధికారులకు రైతులు ఫిర్యాదుచేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ గోపాలపట్నంలో 240 ఎకరాలకు సాగు నీరందించే పాటికాలువలో చెత్త, పూడిక పేరుకుపోవడంతో ఖరీఫ్‌లో సాగునీరందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. పంట కాలువలో ఎక్స్‌కవేటర్‌తో చేపట్టిన పూడిక, చెత్తను తొలగింపు పనులను కాలువను ఆక్రమించిన వ్యక్తి అడ్డుకుంటున్నాడన్నారు. దీనిపై పూర్తి విచారణ చేసి కాలువ అభివృద్ధి పనులను అడ్డుకుంటున్న వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు చించెలపు ప్రదీప్, రైతులు గణపర్తి చంద్రనరసింహారావు, దంతులూరి గోపీనాథ్, కలిదిండి సతీష్‌రాజు, పెమ్మరాజు చంటిరాజు, కాకర్లపూడి శివాజీరాజు, పెంకే గోవిందు, కోనేటి నాగసత్యనారాయణ, సత్తిబాబు, బాబి తదితరులు పాల్గొన్నారు.

ప్యాకేజీ పెంచే వరకు పోరు

కారిడార్ నిర్వాసితుల స్పష్టీకరణ



వంటా-వార్పూ చేస్తూ ఆందోళన చేస్తున్న రైతులు

నక్కపల్లి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వైజాగ్ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్వాసితులు ఇళ్లు కోల్పోతున్న కుటుంబాలలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి రూ.25 లక్షల ప్యాకేజీ ఇవ్వాలని నిర్వాసిత రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట వంటా-వార్పు చేసి పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన రూ.8.9 లక్షలు ఇంటి నిర్మాణానికి చాలదన్నారు. రూ.25 లక్షల ప్యాకేజీ ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు వీసం రామకృష్ణ, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, నాయకులు సురకాసుల గోవింద్, తళ్ల భార్గవ్, గంటా తిరుపతిరావు, మణిరాజు, ఈశ్వరరావు, ఎం.రాజేష్, జి.గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ



కాకరాపల్లిలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఇంటింటికి కరపత్రాలను అందజేస్తున్న సాయికృష్ణ, విజయ్ తదితరులు

మునగపాక, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ పాలన సంక్షేమమే ధ్యేయంగా కొనసాగుతోందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ అన్నారు. మండలంలో కాకరాపల్లిలో సోమవారం మండల పార్టీ అధ్యక్షుడు పెంటకోట విజయ్ ఆధ్వర్యంలో సూపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ఏడాది కాలంలో ప్రభుత్వం మంజూరు చేసిన పథకాలు అందిందీ? లేనిది అడిగి తెలుసుకున్నారు. అదే సందర్భంలో గ్రామంలో సమస్యల గురించి కూడా వాకబు చేశారు. కార్యక్రమంలో ఇల్ల రాజు, పెంటకోట శ్రీరామ్మూర్తి, ప్రసాద్, ముసలయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాంపురంలో పారిశుధ్య పనులు

పాయకరావుపేట రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీరాంపురంలో సోమవారం పారిశుధ్య పనులు చేపట్టారు. డ్రైనేజీలలో పూడిక, రోడ్లపై చెత్త, చెదారాన్ని తొలగించారు. వర్షాలు ప్రారంభమైన నేపథ్యంలో దోమలతో వ్యాధులు ప్రబలే అవకాశమున్నందున పారిశుధ్య పనులు చేపట్టినట్టు పంచాయతీ కార్యదర్శి వైవీ సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా దోమల మందును స్రేయింగ్ చేయించి, ఫాగింగ్ చేసినట్టు ఆయన తెలిపారు.

రోడ్డు విస్తరణ నిర్వాసిత నేతల పాదయాత్ర

అచ్యుతాపురం రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి-అచ్యుతాపురం రోడ్డు నిర్వాసిత నాయకులు సోమవారం పాదయాత్ర చేశారు. విస్తరణలో కోల్పోతున్న భూములకు, ఆస్తులకు నష్టపరిహారంగా టీడీఆర్‌లు వద్దంటూ హరిపాలెం హైస్కూల్ నుంచి అనకాపల్లి ఆర్‌డీఓ కార్యాలయం వరకూ పాదయాత్ర చేశారు. హరిపాలెంలో గ్రామ మహిళలు హారతి ఇచ్చి పాదయాత్రను ప్రారంభించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు మాట్లాడుతూ ఇళ్లు, భూములు, షాపులు కోల్పోతున్న నిర్వాసితులకు టీడీఆర్ బాండ్లు రూపంలో కాకుండా 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనకాపల్లిలోని కలెక్టరేట్‌లో ఆర్డీవోకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో జడ్పీ కోఆప్షన్ సభ్యుడు నర్మాల కుమార్, నిర్వాసిత సంఘ నేతలు పాల్గొన్నారు.

అన్నార్తులకు సాయం చేస్తాం

- మునగపాక స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు



పేదలకు అన్నం ప్యాకెట్లను అందజేస్తున్న సంస్థ సభ్యులు

మునగపాక, జూలై 28 (ఆంధ్రజ్యోతి): అన్నార్తులకు సహాయం చేయడానికి సిద్ధంగా ఉన్నామని మునగపాక స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు ముక్తకంఠంతో చెప్పారు. స్థానిక సాంబమూర్తి కల్యాణ మండపం ఆవరణలో సోమవారం స్వచ్ఛంద సేవా సంస్థ సమావేశం జరిగింది. సేవా సంస్థ సభ్యుడు బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి సోమవారం చేస్తున్న అన్నదానంతో పాటు ఇతర సామాజిక సేవా కార్యక్రమాలు చేసి పేదలను ఆదుకోవాలన్నారు. సేవా సంస్థ అధ్యక్షుడు ఆలంక సూర్యప్రకాశరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీటీసీ సభ్యుడు సూరిశెట్టి రమణ, సభ్యులు దాడి శ్రీరామ్మూర్తి, కేవీ గౌరీపతి, కె.లక్ష్మీజగన్మోహనరావు, సూరిశెట్టి కన్నారావు, దాడి అప్పలనాయుడు, దాడి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని కరపత్రాల పంపిణీ

రాంబిల్లి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్లను ప్రజలంతా వ్యతిరేకించాలని సీపీఎం మండల కార్యదర్శి జి.దేముడునాయుడు, ఐద్వా మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం పిలుపునిచ్చారు. సోమవారం రాంబిల్లిలో ఇంటింటికి తిరికి స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలపై ఆర్థిక భారం మోపేందుకు ప్రభుత్వం చూస్తుందన్నారు. కార్యక్రమంలో ఐద్వా మండల కార్యదర్శి చందక మంగతాయారు. ఎం.దేవి,సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వారిపై చర్యలు తీసుకోవాలి : ఐద్వా




సీఐ గణేష్‌కి వినతిపత్రానిస్తున్న ఐద్వా నాయకులు

అచ్యుతాపురం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మహిళలపై అసభ్యంగా ప్రవర్తించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి. మాణిక్యాంబ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆమె స్థానిక సీఐ నమ్మి గణేష్‌కి వినతిపత్రాన్నిచ్చారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఇటీవల కొనెంపాలెం వద్ద ఒక హోటల్‌లో పనిచేసే బాలికపై అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. బ్రాండిక్స్‌లో వేలాది మంది మహిళలు విధులు నిర్వహిస్తున్న వారి రక్షణకు పోలీసులు గట్టి నిఘా ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కార్యదర్శి రొంగలి లక్ష్మి, నారాయణమ్మ పాల్గొన్నారు.

'బాల్య వివాహాలతో ఎన్నో సమస్యలు'

ఎస్.రాయవరం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో బాల్య వివాహాలు జరగకుండా పూర్తిగా అరికట్టాలని బాలల పరిరక్షణ జిల్లా ప్రతినిధి డి. లోవరాజు పిలుపునిచ్చారు. మండలంలోని ధర్మవరం అగ్రహారం అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం ఆయన అంగన్‌వాడీ సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలతో తలెత్తే ఇబ్బందులు, సమస్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కనకదుర్గ పాల్గొన్నారు.

విద్యార్థిని హిమబిందును అభినందించిన టీచర్లు



హిమబిందును అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఎస్.రాయవరం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలిలో ఇటీవల నిర్వహించిన జిల్లాస్థాయి సబ్ జూనియర్ టైక్వాండో పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించిన పెదగుమ్ములూరు హైస్కూల్ విద్యార్థిని కిల్లాడ హిమబిందును సోమవారం పాఠశాల హెచ్ఎం సుధామాధురి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా సుధామాధురి మాట్లాడుతూ విద్యార్థులు టైక్వాండో శిక్షణ పొందడం వలన ఎన్నో లాభాలు ఉన్నాయన్నారు.

'అధ్యాపకులను నియమించాలి'

ఎస్.రాయవరం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొరుప్రోలు హైస్కూల్ ప్లస్‌కు చెందిన ఇంటర్ విద్యార్థులకు అధ్యాపకులను నియమించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం బాలాజీ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట విద్యార్థులతో ఆందోళన చేసిన అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ హైస్కూల్ ప్లస్‌కు అధ్యాపకులు లేక విద్యార్థులు చదువుకోలేకపోతున్నారని, వారిని నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు చిన్న, రాజు, రమేష్, నరేంద్ర, తాతాజీ, సురేష్ పాల్గొన్నారు.

ఘనంగా వినాయక పంచలోహ విగ్రహ ప్రతిష్ఠ



స్వామివారి కల్యాణంలో పాల్గొన్న లక్ష్మీనారాయణ దంపతులు

అనకాపల్లి టౌన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి గౌరీ పంచాయతన ఆలయంలో సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధి వినాయక పంచలోహ విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవం సోమవారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన స్వామి కల్యాణోత్సవం కన్నుల పండువుగా సాగింది. విగ్రహ దాత కొణతాల లక్ష్మీనారాయణ (పెదబాబు), జయలక్ష్మి దంపతులు కుటుంబ సమేతంగా హాజరై కల్యాణాన్ని జరిపించారు. ఆలయ ప్రధాన అర్చకులు అంపోలు గోపాలకృష్ణ శర్మ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఆలయ కమిటీ అధ్యక్షులు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామసత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పాలిటెక్నిక్ కళాశాలలో అడ్మిషన్లకు కౌన్సెలింగ్

కశింకోట, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ఆర్ఈసీఎస్ పాలిటెక్నిక్ కళాశాలలో కేటాయించిన 50 శాతం సీట్లలో అడ్మిషన్లకు మంగళవారం కౌన్సెలింగ్ జరగనుందని ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ జి.ప్రసాద్ తెలిపారు. పదో తరగతి పూర్తి చేసుకొని పాలీసెట్-2025లో ర్యాంకు పొందిన విద్యార్థులు అడ్మిషన్లకు అర్హులుగా పేర్కొన్నారు. ఆసక్తిగల వారు ఉదయం తొమ్మిది గంటలకు సర్టిఫికెట్లతో కళాశాల వద్ద హాజరు కావాల్సిందిగా కోరారు. రూ.లక్ష లోపు ఆదాయం కలిగిన ఓసీ, బీసీ విద్యార్థులకు ప్రభుత్వ నిబంధల ప్రకారం ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్ అమలు చేయడం జరుగుతుందన్నారు. విద్యార్థులు వారి వెంట ధ్రువపత్రాలు, తెల్ల రేషన్ కార్డును తీసుకుని రావాలన్నారు. ర్యాంకు లేని వారికి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం వర్తించదని, వార్షిక ఫీజులు వారే చెల్లించాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

పట్టణంలో జడ్సీ చక్రవర్తి విస్తృత పర్యటన



గూడ్స్‌షెడ్డు వద్ద పైపులైన్ పనులను పరిశీలిస్తున్న జడ్సీ చక్రవర్తి

అనకాపల్లి టౌన్, జూలై28 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి సోమవారం విస్తృతంగా పర్యటించారు. పలు వార్డుల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. గూడ్స్‌షెడ్డు వద్ద పైపులైన్ దెబ్బతినడం, నీరు వృథాగా పోవడం వల్ల మళ్లవీధి ప్రాంతానికి నీరు అందడం లేదని గుర్తించారు. వెంటనే తాగునీటి విభాగం సిబ్బందిని పిలిపించి పైపులైన్‌ను దగ్గరుండి మరమ్మతులు చేయించారు. అలాగే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మహిళలకు సూచించారు. జీవీఎంసీ వాహనాలు వచ్చేటప్పుడు తడి, పొడి చెత్తలను వేర్వేరుగా అందజేయాలని సూచించారు. ప్లాస్టిక్ సంచులు వాడకుండా గుడ్డ సంచులనే వాడాలన్నారు. ఆయన వెంట శానిటేషన్, తాగునీటి విభాగం అధికారులు, సిబ్బంది ఉన్నారు.

'ఫార్మాసిటీ డెవలపర్‌గా రాంకీని తప్పించాలి'

పరవాడ, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : విశాఖ ఫార్మాసిటీ లిమిటెడ్‌కు డెవలపర్‌గా వ్యవహరిస్తున్న రాంకీ యాజమాన్యాన్ని తక్షణమే తప్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ విజయకృష్ణన్ కలిసి సమస్యను వివరించారు. రాంకీ యాజమాన్యం కోస్టల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ (సీడబ్ల్యూఎంపీ) షెడ్ల వెనుక ప్రదేశంలో వందలాది టన్నుల ఘన వ్యర్థాలను నిల్వ చేయడం నిబంధనలకు విరుద్ధమని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు ఈ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించారని, సదరు రాంకీ సంస్థకు నోటీసులు కూడా జారీ చేశారని వివరించారు. వేలాది టన్నుల ఘన వ్యర్థాలను నిల్వ ఉంచడం వలన తానాం, పరవాడ, భరణికం గ్రామాల ప్రజలు కాలుష్యానికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే రాంకీ యాజమాన్యం సమీపంలో గల పరవాడ ఊర చెరువు, పెద్ద చెరువు, మల్లోడి వాగులోకి వ్యర్థ రసాయన జలాలను విడిచిపెట్టి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతోందని పేర్కొన్నారు. తక్షణమే సదరు సంస్థపై చర్యలు తీసుకోవడంతో పాటు ఫార్మాసిటీ డెవలపర్‌గా తప్పించాలని కోరారు.


పద్మశాలి సంక్షేమ సంఘం మండల కమిటీ ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

అనకాపల్లి టౌన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : పద్మశాలి సంక్షేమ సంఘం మండల నూతన కమిటీ ఎన్నిక ఇక్కడి శారదా కాలనీలో నిర్వహించారు. గౌరవాధ్యక్షుడిగా అముజూరి రామకృష్ణ, అధ్యక్షుడిగా గెడ్డం ప్రభాకర్ దివ్యతేజ, ఉపాధ్యక్షులుగా తిప్పాన అప్పారావు, దొడ్డి సూరిబాబు, కన్వీనర్‌గా పంపాన సత్య నారాయణ ఎన్నికయ్యారు. కార్యదర్శిగా సూరిశెట్టి రుషిబాబు, సహాయ కార్యదర్శులుగా కాకి శ్రీను, ఇమంది విజయ్‌కుమార్, కోశాధికారిగా ఆకుల వెంకట అప్పారావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కాకి పైడిరాజు, జాయింట్ ఆర్గనైజర్ కార్యదర్శిగా ఆకుల రాజుబాబులను ఎన్నుకున్నారు.

జిల్లాస్థాయి యోగాలో తుమ్మపాల వాసుల ప్రతిభ



పోటీల్లో ప్రతిభ చూపిన శ్రీకృష్ణ యోగా సెంటర్ విద్యార్థులు

తుమ్మపాల, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : పరవాడలో యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన జిల్లా స్థాయి యోగా పోటీల్లో తుమ్మపాల శ్రీకృష్ణ యోగా సెంటర్‌కు చెందిన ఎలువురు అత్యుత్తమ ప్రతిభను కనబరిచారు. 45- 55 ఏళ్ల విభాగంలో బి.నరసింగరావు ప్రథమ బహుమతి, బి.నాగమణి ద్వితీయ బహుమతి, ఎ.ఇంద్రాదేవి తృతీయ బహుమతిని సాధించారు. అలాగే 18 నుంచి 28 ఏళ్ల విభాగంలో ఎ.ధన్యతేజస్విని ద్వితీయ బహుమతి, 10- 14 ఏళ్ల విభాగంలో వి. వాసిని నాల్గో బహుమతి, బి.జయశ్రీ తృతీయ బహుమతిని సొంతం చేసుకున్నారు. వీరిని సోమవారం టీడీపీ మండల అధ్యక్షుడు కర్రి బాబి, ఎస్‌వీడీఎస్ కార్యదర్శి కె.జోగినాయుడు, నాయకులు ఎం.అజయ్, నడిపల్లి గణేష్, ఎం.బోసుబాబు, పి.గణపతితో పాటు పలువురు నాయకులు అభినందించారు.

చిన్న సమస్యలపైనా చెప్పలేనంత నిర్లక్ష్యం

▸▸ తుమ్మపాలలోని కంచరపేట వీధి, కశింకోటలోని సత్తెమ్మ కాలనీలలో మురుగు తిష్ఠ ▸▸ పలుచోట్ల పేరుకుపోయిన చెత్త

▸▸ పంచాయతీల అభివృద్ధికి కూటమి సర్కారు నిధులిస్తున్నా పట్టించుకోని స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు





కంచరపేట వీధి అంగన్‌వాడీ కేంద్రానికి ఎదురుగా పేరుకుపోయిన చెత్త, కాలువలో మురుగు తిష్ఠ

తుమ్మపాల, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : మేజర్ పంచాయతీ తుమ్మపాలలోని కంచరపేటవీధిలో పారిశుధ్యం క్షీణించింది. ఏ మూల చూసినా చెత్తకుప్పలే కనిపిస్తున్నాయి. కాలువల్లో మురుగు ముందుకు పారడం లేదు. కాలనీని ఆనుకొని ఉన్న అంగన్‌వాడీ కేంద్రం, ఎంపీపీ స్కూల్ వద్ద ఏపుగా ఎదిగిన తుప్పలతో చిన్నారులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పురుగులు, విషసర్పాల సంచారంతో హడలిపోతున్నారు. సమస్యలను పంచాయతీ అధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేకపోతోందని వాపోతున్నారు. గత వైసీపీ పాలనలో పంచాయతీల చేతిలో చిల్లిగవ్వ ఉండేది కాదని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం నిధులు కేటాయిస్తున్నా స్పందన లేకపోవడం ఏమిటని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కంచరపేటవీధిలో దాదాపు 50 కుటుంబాల వరకు నివాసం ఉంటున్నాయి. ఇది శివారు ప్రాంతం. ఇక్కడ పారిశుధ్య పనులు చేపట్టకపోవడంతో అధ్వానంగా మారుతోంది. రోజుల తరబడి చెత్త పేరుకుపోతోంది. కాలువల్లో పూడిక తొలగించకపోవడంతో మురుగు తిష్ఠ వేస్తోంది. ఫలితంగా దుర్వాసన వెదజల్లుతుండడంతో ఆయా ప్రాంతాల్లో నివాసితుల అవస్థలు తీవ్రంగా ఉన్నాయి. దీనికితోడు చీకటిపడిందంటే దోమల బెడద అధికంగా ఉందంటున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు మరింత దారుణంగా తయారైందని వాపోతున్నారు.

విద్యార్థులు, చిన్నారుల అవస్థలు

ఈ వీధి శివారులో ఉన్న ఎంపీపీ స్కూల్, అంగన్‌వాడీ కేంద్రాలకు ఆనుకొని తుప్పలు పెరిగిపోవడంతో విద్యార్థులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ తుప్పల నడుమ కాలిబాటలో నడుచుకుంటూ అంగన్‌వాడీ కేంద్రానికి, పాఠశాలకు వెళ్లి వస్తున్నారు. ఇటువంటి సందర్భాల్లో విషసర్పాల భయం వెంటాడుతుందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడి సమస్యలను పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. తక్షణమే చెత్తకుప్పలు, తుప్పలను తొలగించడంతో కాలువల్లో పూడికతీయాలని అక్కడివారంతా కోరుతున్నారు.



సత్తెమ్మ కాలనీలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు

సత్తెమ్మ కాలనీలో...

కశింకోట : మండల కేంద్రం కశింకోటలోని సత్తెమ్మ కాలనీలో మురుగు తిష్ఠ వేసింది. ప్రధానంగా రోడ్డుకు ఇరువైపులా కాలువలు లేక వాడుకనీరు రోడ్డుపై ప్రవహించి నిల్వ ఉండి పోతోంది. దీంతో భరించలేని దుర్వాసన వెదజల్లుతోందని నివాసితులు వాపోతున్నారు. పంచాయతీ అధికారులకు సమస్యను విన్నవించినా పట్టించుకోవడం లేదని పలువురు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. మురుగు కారణంగా దోమల బెడద విపరీతంగా ఉందని అంటున్నారు. తక్షణమే పంచాయతీ అధికారులు స్పందించి మురుగునీరు ముందుకు పారేలా చర్యలు చేపట్టాల్సిందిగా అంతా కోరుతున్నారు.



నిల్వ ఉన్న నీరు నాచుపట్టిన దృశ్యం

'సుజల స్రవంతి'లో భూములు కోల్పోతున్న వారికి న్యాయం చేయాలి

▸▸ ఆర్డీవో కార్యాలయం ఎదుట రైతులు ధర్నా



ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

అనకాపల్లి టౌన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : బాబు జగ్జీవన్‌రామ్ సుజల స్రవంతి ప్రాజెక్టు నిర్మాణంలో భూములు కోల్పోతున్న తమకు న్యాయం చేయాలంటూ పలువురు రైతులు సోమవారం ఇక్కడి ఆర్డీవో కార్యాయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయనబాబు మాట్లాడుతూ సుజల స్రవంతి ప్రాజెక్టు వలన భూములు కోల్పోయిన రైతులకు 2013 భూసేకరణ చట్టాన్ని అమలు చేయాలని, బలవంతపు భూసేకరణ చేయొద్దని డిమాండ్ చేశారు. సబ్బవరం మండలం నల్లరేగులపాలెం గ్రామ పంచాయతీ రెవెన్యూ పరిధి రైతులు 70 ఏళ్లగా సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని వివరించారు. మార్కెట్ ధరకు నాలుగు రెట్లు అధికంగా నష్టపరిహారం చెల్లించాలని కోరారు. లేనిపక్షంలో ఆ భూములు ఇచ్చేది లేదని స్పష్టం చేశారు. రైతులు ప్రస్తుతం వారి భూముల్లో వరి, చెరకు, సరుగుడు, చోడి, వేరుశనగ, నువ్వులు వంటి పంటలను పండించుకొని జీవనం సాగిస్తున్నారన్నారు. ఈ పరిస్థితుల్లో 2013 భూసేకరణ చట్టానికి అనుగుణంగా భూమి బదులుగా మరోచోట భూములు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో ఆయిషాకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ ధర్నాలో నిర్వాసితుల భూ సమీకరణ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గంటా శ్రీరామ్, వి.నరేంద్రకుమార్, పెతకంశెట్టి రమేష్, గొలగాని అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

'చంద్రబాబు సారథ్యంలో ఉత్తరాంధ్ర అభివృద్ధి'



సమావేశంలో మాట్లాడుతున్న బుద్ద నాగజగదీశ్వరరావు

తుమ్మపాల, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సారథ్యంలో ఉత్తరాంధ్ర శరవేగంగా అభివృద్ధి చెందుతుందని మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు అన్నారు. ఇక్కడి టీడీపీ పార్లమెంటరీ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఉత్తరాంధ్ర నాయకులైన అశోక్‌గజపతిరాజుకు గవర్నర్ పదవి రావడం ఆనందదాయకమన్నారు. అలాగే కింజరాపు రామ్మోహన్‌నాయుడు, కలిశెట్టి అప్పలనాయుడులకు సముచిత స్థానం దక్కడం ఉత్తరాంధ్రకే గౌరవంగా పేర్కొన్నారు. అలాగే ఉత్తరాంధ్రకు త్వరలో ప్రఖ్యాతి కంపెనీలు టీసీఎస్, కాగ్నిజెంట్, గూగుల్ డేటా రానున్నాయన్నారు. విశాఖలో ఐటీ సెజ్, ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ, భోగాపురం గ్రీన్ ఎయిర్ పోర్టు, విశాఖ రైల్వేజోన్ ఏర్పడడం తథ్యంగా పేర్కొన్నారు. గత వైసీపీ పాలకులు అక్రమాలకు పాల్పడి జేబులు నింపుకున్నారే తప్ప, అభివృద్ధిపై దృష్టి సారించలేదని ఆరోపించారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు కోట్ని రామకృష్ణ, బోడి వెంకటరావు, మళ్ల గణేష్, పిళ్లా తారకేశ్వరరావు పాల్గొన్నారు.

ఇకపై జోన్‌ల వారీగా సమావేశాలు

▸▸ వార్డుల్లో సమస్యలు,అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలను

▸▸ నేరుగా తెలుసుకోవాలని జీవీఎంసీ కమిషనర్ నిర్ణయం

▸▸ కార్పొరేటర్లు, అధికారులతో భేటీ

▸▸ నేడు జోన్-1 పరిధిలో సమావేశం

విశాఖపట్నం, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : వార్డుల్లో సమస్యలు, అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలను నేరుగా తెలుసుకునేందుకు ఇకపై జోన్‌ల వారీగా కార్పొరేటర్లు, అధికారులతో భేటీ కావాలని కమిషనర్ కేతన్‌గార్గ్ నిర్ణయించారు. కమిషనర్ కలిసేందుకు తమకు అవకాశం ఇవ్వడం లేదని, సమస్యలపై విజ్ఞాపనలు అందజేసినా పట్టించుకోవడం లేదని కొందరు కార్పొరేటర్లు అసంతృప్తితో ఉన్నారు. కార్పొరేటర్లు బహిరంగంగా తమ అసంతృప్తిని వ్యక్తంచేయడంతో 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిని అధిగమించేందుకు ఇకపై జోన్‌లవారీగా కార్పొరేటర్లతో భేటీ కావాలని కమిషనర్ నిర్ణయించారు. ఆ సమావేశానికి అన్ని విభాగాల అధిపతులతోపాటు ఆయా జోన్‌ల కమిషనర్లు, ఇతర ముఖ్య అధికారులు కూడా హాజరయ్యేలా చేయడం ద్వారా వార్డుల్లో సమస్యలను పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందని ఆయన భావిస్తున్నారు. దీనిపై ఇప్పటికే అధికారులకు కమిషనర్ సమాచారం అందజేశారు. మొదటగా జోన్-1 (భీమిలి)లో ఈనెల 29న సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. వచ్చే నెల రెండున జోన్-2, 6న జోన్-3, 12న జోన్-4, 16న జోన్-5, 20న జోన్ 6, 23న జోన్-7, 26న జోన్-8లో సమావేశం నిర్వహించాలని షెడ్యూల్ తయారుచేసి జోనల్ కమిషనర్లకు పంపించారు. ఆయా కార్పొరేటర్లకు దీనికి సంబంధించిన సమాచారాన్ని ముందుగానే అందజేసే బాధ్యతను జోనల్ కమిషనర్లకు అప్పగించారు. సమావేశానికి సంబంధించిన అజెండాను ఒకరోజు ముందుగానే తయారుచేసి తనకు అందజేయాలని స్పష్టంచేశారు.

'భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలి'

అనకాపల్లి టౌన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ డిమాండ్ చేశారు. సోమవారం సదరు కార్మికులతో కలిసి తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న 46 వేల క్లెయిమ్‌లను త్వరితగతిన పరిష్కరించి, నిధులు మంజూరు చేయాలన్నారు. గత వైసీపీ ప్రభుత్వం బోర్డు నుంచి వాడుకున్న నిధులను తిరిగి బోర్డుకు జమ చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ పథకాలతో సంబంధం లేకుండా 1996 చట్టం అమలు చేసి కార్మికులకు 12 రకాలు సౌకర్యాలు అందించాలన్నారు. కార్మిక శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి సిబ్బంది కొరత లేకుండా చూడాలని విన్నవించారు. అనంతరం తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం ప్రతినిధులు ఎస్.రామారావు, బండారు వెంకటేష్, గంగిరెడ్ల సూరిఅప్పారావు, కరణం భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు పరవాడ మండల సమావేశం

పరవాడ, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో బి.రమేష్‌నాయుడు తెలిపారు. ఎంపీపీ పైలా వెంకట పద్మలక్ష్మి అధ్యక్షతన ఉదయం పది గంటలకు ప్రారంభం కానున్న సమావేశానికి సర్పంచులు, ఎంపీటీసీలతో పాటు ఆయాన శాఖల అధికారులు హాజరు కావాల్సిందిగా ఆయన కోరారు.

బ్రాహ్మణ సంఘం జిల్లా కార్యదర్శిగా కళ్యాణ్‌శర్మ



సబ్బవరం, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి విశాఖ జిల్లా బ్రాహ్మణ సంఘం కార్యదర్శిగా సబ్బవరానికి చెందిన దంతుర్తి లక్ష్మీకృష్ణ కళ్యాణ్‌శర్మ నియమితులయ్యారు. విజయవాడలో ఆదివారం జరిగిన బ్రాహ్మణ సంఘ కార్యవర్గ ఎన్నికల్లో తనను జిల్లా కార్యదర్శిగా ఎన్నుకున్నట్టు ఇక్కడి విలేకరులకు ఆయన తెలియజేశారు. బ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఆయనను శాప్ బోర్డు డైరెక్టర్ పీవీఎస్ఎన్ రాజు, టీడీపీ మండల కార్యదర్శి కోరాడ శ్రీనుతో పాటు పలువురు అభినందించారు.

పూల్‌బాగ్ జంక్షన్‌లో కాలువలు శుభ్రం



కాలువను శుభ్రం చేస్తున్న కార్మికుడు

అనకాపల్లి టౌన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : నూకాంబిక ఆలయానికి వెళ్లే మార్గంలోని పూల్‌బాగ్ జంక్షన్‌లో అధ్వానంగా ఉన్న మురుగు కాలువను జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది శుభ్రం చేశారు. 'పూల్‌బాగ్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

జంక్షన్ కాలువలో మురుగు తిష్ఠ' శీర్షికతో సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితం కావడంతో జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి వెంటనే స్పందించారు. శానిటేషన్ విభాగం సూపర్‌వైజర్ రవికి సూచనలు చేయడంతో ఆయన సిబ్బందిని పంపి కాలువలో మురుగును తొలగించడంతో పాటు పారిశుధ్య పనులు చేయించారు.

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ప్రచారం

కశింకోట, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : స్మార్ట్ మీటర్లను ప్రజలంతా వ్యతిరేకించాలని సీపీఎం నాయకులు కశింకోటలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు వి.వి.శ్రీనివాసరావు, దాకారపు శ్రీనివాసరావు, డి.డి.వరలక్ష్మిలు ఇంటింటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాల గురించి వివరించారు. స్మార్టు మీటర్ల వల్ల భవిష్యత్తులో విద్యుత్ బిల్లుల మోతమోగనుందన్నారు. ఈ మీటర్లు బిగించుకుంటే పగలు ఒక రేటు, రాత్రి పూట మరో రేటు చెల్లించాల్సిన పరిస్థితి ఉంటుందని ఆరోపించారు. ముందుగానే డబ్బు చెల్లించి రీచార్జి చేయించుకునే దుస్థితి దాపురిస్తుందన్నారు. ప్రజలంతా ఈ మీటర్లను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా స్పందించాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'పారిశుధ్య కార్మికులను కొనసాగించాలి'



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి జానకి

అనకాపల్లి టౌన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో శానిటేషన్ కార్మికులను తొలగించడం అన్యాయమని ఆంధ్రప్రదేశ్ స్కూల్స్ శానిటేషన్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జానకి అన్నారు. సోమవారం ఇక్కడ జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ స్కూళ్లలో శానిటేషన్ విధులు నిర్వహిస్తున్న కార్మికులను 300 మంది విద్యార్థులకు ఒకరు తక్కువగా ఉన్నా రెండో కార్మికురాలిని తొలగించడం అన్యాయమన్నారు. ఇటువంటి వారిని యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్మికులు ఒకరైతే పనిభారం పెరుగుతుందని ప్రభుత్వం గుర్తించాలన్నారు.. ఒక పక్క స్కూల్ శానిటేషన్ విధులు నిర్వహిస్తూనే ప్రధానోపాధ్యాయులు చెప్పే ఇతర పనులు కూడా చేయాల్సి వస్తుందని వాపోయారు. రెండు వందల మంది విద్యార్థులు దాటిన స్కూల్‌లో ఇద్దరు కార్మికులను ఉంచాలని డిమాండ్ చేశారు. ఈ మావేశంలో సంఘం నాయకులు గౌరీ, ఎస్కే బీబీ, లక్ష్మి, అమ్మాజీ, జి.వరలక్ష్మి పాల్గొన్నారు.

స్క్రాప్ ఆశ చూపి రూ. రెండు లక్షలు టోకరా

▸▸ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసిన పాత ఇనుము వ్యాపారి

అనకాపల్లి టౌన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : స్క్రాప్ ఆశ చూపి రూ.రెండు లక్షలు టోకరా వేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్ సోమవారం తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయన కథనం ప్రకారం వివరాలివి. పూడిమడక రోడ్డులో పాత ఇనుము వ్యాపారం చేస్తున్న కర్రి నాగశేఖర్‌కు ఏప్రిల్ ఎనిమిదో తేదీన గుర్తు తెలియని వ్యక్తి నుంచి ఫోన్ కాల్ వచ్చిందన్నారు. అవతల వ్యక్తి తన వద్ద ఎక్కువగా స్క్రాప్ ఉందని చెబుతూ అందుకు సంబంధించిన ఫోటోలు పంపి ఎంత ఇస్తావని ప్రశ్నించాడన్నారు. దీంతో నాగశేఖర్ రూ.రెండున్నర లక్షలు గుర్తు తెలియని వ్యక్తికి ఆన్‌లైన్ ద్వారా పంపినట్టు సీఐ చెప్పారు. ఆ తరువాత గుర్తు తెలియని వ్యక్తి నుంచి ఎటువంటి స్పందన రాకపోవడంతో సైబర్ క్రైమ్‌కు ఆదివారం రాత్రి ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ చెప్పారు.

అక్రమంగా 20 మద్యం బాటిళ్లు తరలిస్తున్న వ్యక్తిపై కేసు

కొత్తూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. మార్టూరు గ్రామానికి చెందిన బల్లా గోవింద సోమవారం గోనె సంచిలో 20 మద్యం క్వార్టర్ బాటిళ్లు తరలిస్తుండగా గుర్తించి అదుపులోకి తీసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

31 వరకు జూనియర్ కళాశాలలో చేరేందుకు గడువు

సబ్బవరం, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో చేరేందుకు ఈ నెల 31వ తేదీ వరకూ గడువు ఉన్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ పి.శిరీషారాణి సోమవారం విలేకరులకు తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులై వారంతా కళాశాల లో చేరేందుకు అర్హులుగా పేర్కొన్నారు. సంబంధిత ధ్రువపత్రాలతో పత్రాలతో నేరుగా కళాశాలకు వచ్చి ప్రవేశాలు పొంద వచ్చునన్నారు. ప్రభుత్వ కళాశాల్లో చదువుతున్న విద్యార్థులకు అనేక సంక్షేమ పథ కాలతో పాటు నాణ్యమైన విద్యనందిస్తున్నట్టు చెప్పారు. ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న దొన్నుదొర, పక్కన నాయకులు

ఉత్తరాంధ్ర నేతలకు సముచిత గౌరవం

ఆర్టీసీ విజయనగరం రీజియన్ చైర్మన్ దొన్నుదొర

అరకులోయ, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రను అభివృద్ధి చేయడమే కాకుండా ఇక్కడి నాయకులకు సీఎం చంద్రబాబు సముచిత గౌరవం కల్పిస్తున్నారని ఆర్టీసీ విజయనగరం రీజియన్ చైర్మన్, టీడీపీ నియోజవర్గ ఇన్‌చార్జి సియ్యారి దొన్నుదొర అన్నారు. తన స్వగృహంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్‌మోహనరెడ్డి నాడు ఉత్తరాంధ్ర పాలకులను అవమానిస్తే, సీఎం చంద్రబాబునాయుడు ఉత్తరాంధ్ర నాయకులకు అత్యున్నత పీఠాల్లో కూర్చోబెట్టారన్నారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్ష పదవి విశాఖకు చెందిన పల్లా శ్రీనివాసరావుకు, కేంద్రమంత్రి పదవి కింజరాపు రామ్మోహనరావుకు పదవి ఇచ్చి సత్కరించారన్నారు. అత్యున్నతమైన స్పీకర్ పదవి బీసీ నాయకుడు అయ్యన్నపాత్రుడుకు, ప్రధానమైన హోం మంత్రి పదవిని దళిత మహిళ అనితకు ఇస్తే, కొండపల్లి శ్రీనివాస్ లాంటి యువకులకు మంత్రి పదవులు ఇవ్వడం ద్వారా ఉత్తరాంధ్ర నేతలకు చంద్రబాబు గౌరవించి సత్కరించారన్నారు. ఇక నిజాయతీ, నిబద్ధత కలిగిన అశోక్‌గజపతిరాజుకు గోవా గవర్నర్‌గా పదవిని ఇవ్వడం ద్వారా ఉత్తరాంధ్ర నాయకులు, ప్రజల పట్ల చంద్రబాబు ప్రేమానురాగాలను చాటుకున్నారన్నారు. గోవా గవర్నర్ పదవికి అశోక్‌గజపతిరాజు వన్నె తెస్తారని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

క్షయపై అవగాహన ర్యాలీ

పెదబయలు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వారపు సంతలో సోమవారం క్షయపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి నిఖిల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పూర్ణయ్య, తహశీల్దార్ త్రినాథరావురావు నాయుడు మాట్లాడుతూ అవగాహనతోనే క్షయ వ్యాధిని సమూలంగా నిర్మూలించగలమని చెప్పారు. క్షయ వ్యాధిని అంతం చేయటానికి ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు చేపడుతున్నాయన్నారు. ఇందులో భాగంగా క్షయ రహిత మండలంగా పెదబయలును చేసేందుకు వైద్యులు, సిబ్బందితో కలిసి కృషి చేస్తున్నామన్నారు. పౌష్టికాహారం తీసుకుంటే క్షయ నుంచి విముక్తి పొందవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్యామ్‌ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

జన్‌మన్ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

▸▸ ఎంపీడీవో సీతామహాలక్ష్మి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సీతామహాలక్ష్మి

చింతపల్లి, జూలై 28 (ఆంధ్రజ్యోతి):పీఎం జన్‌మన్ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని స్థానిక ఎంపీడీవో సీహెచ్ సీతామహాలక్ష్మి అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో పక్కా గృహాల నిర్మాణాలపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. మండలంలో 1,466 గృహాలు నేటి వరకు పనులు ప్రారంభించలేదన్నారు. ఈపక్కా గృహాలన్నీ సకాలంలో ప్రారంభించేలా ఇంజనీరింగ్ అసిస్టెంట్లు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో గ్రౌడింగ్ మేళాలు నిర్వహించి లబ్ధిదారులతో నిర్మాణ పనులు ప్రారంభించాలన్నారు. అలాగే పునాదుల్లో 1,215, రూఫ్ స్థాయిలో 1,267, స్లాబ్ స్థాయిలో 358 గృహాలు ఉన్నాయన్నారు. ఈగృహాలన్ని సకాలంలో పూర్తి చేయాలన్నారు. అలాగే పీఎంఏవై 2021-22కి పథకంలో 577మందికి పునాదుల లోపు నిర్మించుకున్న లబ్ధిదారులకు రూ.ఐదువేలు జమ చేశామని, ఆ నగదు తీసుకున్న లబ్ధిదారులు సైతం నిర్మాణాలు చేపట్టడంలేదన్నారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పక్కా గృహాల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ కె. రమణబాబు, వర్క్ ఇన్‌స్పెక్టర్ ఎస్. రాజారావు, ఉపాధి హామీ పథకం సిబ్బంది, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మరోసారి రాయితీ వరి విత్తనాలివ్వండి

▸▸ సీపీఐ మండల కార్యదర్శి ఉల్లి సూరిబాబు

కొయ్యూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండలానికి మరో దఫా రాయితీ వరి విత్తనాలు సరఫరాకు అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి ఉల్లి సూరిబాబు కోరారు. వాతావరణ ప్రతికూల పరిస్థితుల నడుమ నారు వేసిన వరి విత్తనాలు మొలకెత్తలేదని, అందువల్ల వరి విత్తనాలకు డిమాండ్ ఏర్పడిందని సూరిబాబు పేర్కొన్నారు. ప్రస్తుతం వరిసాగుకు అనుగుణంగా వాతావరణం ఉన్నప్పటికీ మరో దఫా నారుమడులు వేసుకునేందుకు విత్తనాలు లేక రైతాంగం ఇబ్బంది పడుతున్నారన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని గతంలో విత్తనాలు తీసుకున్న రైతుల పొలాలను వ్యవసాయశాఖాధికారులచే తనిఖీ చేయించి, వరినారుకు ఇబ్బంది పడే రైతులను గుర్తించి వారందరికీ మరో దఫా రాయితీ విత్తనాలు అందించాలని కోరారు. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని సూరిబాబు కోరారు.

స.హ. చట్టంపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలి

పాడేరురూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టంపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.వనుము చిట్టిబ్బాయి అన్నారు. సోమవారం కళాశాలలో ఆర్టీఐ చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పౌరులకు ప్రభుత్వ సమాచారాన్ని పొందే హక్కును కల్పించేందుకు ఈ చట్టాన్ని ఏర్పాటు చేశారన్నారు. ఈ చట్టంపై విద్యార్థులకు కళాశాల జేకేసీ కో-ఆర్డినేటర్ జి.భాస్కరరావు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, వ్యాసరచన, క్విజ్ పోటీలను నిర్వహించారు. ప్రతిభను చూపిన విద్యార్థులకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్.టీఎన్.రసూల్, ఐక్యూసీ కో-ఆర్డినేటర్ వి.కోటేశ్వరరావు, అధ్యాపకులు టి.సుమిత్ర, కె.నిర్మల, యు.వారిజ, ఈవీ.జయలక్ష్మి, ఎన్ఎస్ఎస్ జిల్లా పీవో జి.గౌరీశంకరరావు పాల్గొన్నారు.

చింతపల్లిలో ద్విచక్రవాహనం చోరీ

చింతపల్లి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గూణలంక వీధిలో ఇంటి బయట పార్కు చేసిన ద్విచక్రవాహనం చోరీకి గురైంది. బాధితుడి కథనం ప్రకారం స్థానిక డిగ్రీ కళాశాలలో కాంట్రాక్టు అధ్యాపకుడుగా పనిచేస్తున్నా కొర్ర పూర్ణారావు ఆదివారం రాత్రి ఇంటి వద్ద బయట ద్విచక్ర వాహనాన్ని పార్కు చేసి నిద్రపోయారు. ఉదయానికి ద్విచక్రవాహనం కనిపించకుండా పోయిందన్నారు. ఈమేరకు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపాడు.

మోదకొండమ్మను దర్శించుకున్న ప్రైవేట్ ఎలక్ట్రికల్ అసోసియేషన్ నేతలు

పాడేరురూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక మోదకొండమ్మ అమ్మవారిని రాష్ట్ర ప్రైవేటు ఎలక్ట్రికల్ అసోసియేషన్ అధ్యక్షుడు డీవీ.సత్యనారాయణ, ఉపాధ్యక్షులు కె.పాల్‌రాజ్, ప్రధాన కార్యదర్శి కె.శ్రీహరిరావు, తిరుపతి అధ్యక్షుడు బీసీ హరీస్, నాయకులు నారాయణ, మల్లిఖార్జున సోమవారం దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు జిల్లా నాయకులు పి.బబ్జ్యా, వి.గోవిందరాజు, ఎం.స్వామినాయుడు, ఎస్.వరప్రసాద్, జి.కృష్ణారావు, ఎస్.కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు నుంచి ఆకాంక్ష హాట్ కార్యక్రమం

జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్ కుమార్

పాడేరురూరల్, జూలై 28(ఆంధ్రజ్యోతి): సంపూర్ణ అభియాన్ సమ్మాన్ సమారో కార్యక్రమంలో భాగంగా ఆగస్టు 2వ తేదీ నుంచి ఆకాంక్ష హాట్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్ కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లో జేసీ డాక్టర్.ఎంజే.అభిషేక్ గౌడతో కలిసి సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ యాస్పిరేషన్ జిల్లాగా అల్లూరి జిల్లా ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. నీతి ఆయోగ్ జిల్లాకు రూ.10 కోట్లు ఇన్సెంటివ్ ఇవ్వడం జరిగిందన్నారు. రంపచోడవరం డివిజన్‌లో గంగవరం, మారేడుమిల్లు, వైలవరం ఒక యాస్పిరేషన్‌గా గుర్తించి అక్కడ హెల్త్ అండ్ న్యూట్రీషన్, వ్యవసాయం, విద్య, మోడల్ స్కూల్, సోషల్ డెవలప్‌మెంట్ అనే అంశాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్టు తెలిపారు. కాఫీ ఇతర ఉద్యాన పంటలను మేడిన్ అరకుగా బ్రాండ్ తీసుకురావడంతో గిరిజన రైతులకు మంచి ఆదాయం లభిస్తుందన్నారు. ప్రత్యేక స్కూల్, టీచర్లు, వాతావరణం అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టి ఒక మోడల్ స్కూల్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

ఆగస్టు 2న వివిధ శాఖల్లో బాగా పనిచేస్తున్న ఉద్యోగులను సన్మానించడం జరుగుతుందన్నారు. ఆగస్టు 2 నుంచి 25 వరకు ఆకాంక్ష హాట్‌ను కాఫీహౌస్‌లో ఏర్పాటు చేయాలని అధికారులకు ఆయన సూచించారు. ఆకాంక్ష హాట్‌కి ప్రజలు సందర్శించి ఉత్పత్తులను ప్రోత్సహించాలని ఆయన కోరారు.

మావోయిస్టులను ఆదివాసీలు విశ్వసించడం లేదు

▸▸ ఏఎస్పీ నవజ్యోతి మిశ్రా


ఏఎస్పీ నవజ్యోతి మిశ్రా

చింతపల్లి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టులను ఆదివాసీలు విశ్వసించడం లేదని స్థానిక ఏఎస్పీ నవజ్యోతి మిశ్రా అన్నారు. సీపీఐ మావోయిస్టులు ఆవిర్భావ వారోత్సవాల నేపథ్యంలో సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. మావోయిస్టుల వల్ల గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి కుంటుబడిపోతుందన్నారు. ఆదివాసీలు అభివృద్ధిని కోరుకుంటున్నారని, మావోయిస్టులను ప్రజా వ్యతిరేక విధానాల వల్ల ప్రజల్లో వ్యతిరేకత పెరిగిందన్నారు. జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో మావోయిస్టుల కదలికలు పెద్దగా లేవన్నారు. మావోయిస్టులు స్వచ్ఛందంగా లొంగిపోయి ప్రజాజీవితంలో కలవాలన్నారు. ఆదివాసీ యువతకు ఉపాధి కల్పించడం, ప్రతి గ్రామానికి రహదారులు నిర్మిస్తుందన్నారు. ఆదివాసీలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తుందన్నారు. దీంతో యువత మావోయిస్టు సిద్ధాంతాలు, ఉద్యమానికి దూరంగా ఉంటున్నారన్నారు. విద్యార్థులు విద్యపై ఆసక్తి పెంచుకుంటున్నారని, పిల్లలు ఉన్నత విద్య అభ్యసించేందుకు తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. మావోయిస్టుల వారోత్సవాల్లో ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుందన్నారు. ఏపీఎస్పీ, సీఆర్‌పీఎఫ్ పోలీసులతో గాలింపు చర్యలను చేపడుతుందని, ప్రధాన కేంద్రాల్లో తనిఖీలు చేయడం జరుగుతుందన్నారు. మావోయిస్టు టార్గెట్‌లో నున్న వ్యక్తులు, వీఐపీలు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని సూచించడం జరిగిందన్నారు. ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని, పోలీసుశాఖ ప్రజలకు పూర్తి భద్రత కల్పిస్తుందన్నారు.

గంజాయితో రెండు సార్లు పట్టుబడితే పిట్ ఎన్‌డీపీఎస్ షీట్

▸▸ ఆస్తులు జప్తు, ఏడాది వరకు బెయిల్ లభించదు

▸▸ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వినోద్ కుమార్


సీఐ వినోద్ బాబు

చింతపల్లి, జూలై 28 (ఆంధ్రజ్యోతి):గంజాయితో రెండు సార్లు పట్టుబడితే పిట్ ఎన్‌డీపీఎస్ షీట్ తెరిచి కఠిన చర్యలు తీసుకుంటామని స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం. వినోద్‌బాబు అన్నారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గిరిజన ప్రాంతం నుంచి మైదాన ప్రాంతాలకు గంజాయి రవాణాను పూర్తిస్థాయిలో కట్టడి చేసేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు అమలులోకి తీసుకొచ్చిందన్నారు. ఒక వ్యక్తి గంజాయి సాగు, రవాణ చేస్తూ రెండు సార్లు పట్టుబడితే పిట్ ఎన్‌డీపీఎస్ షీట్ తెరచి కేసు నమోదు చేస్తామన్నారు. ఈ కేసులో అరెస్టు అయిన వ్యక్తికి ఏడాది వరకు బెయిల్ రాదన్నారు. సంబంధిత వ్యక్తితోపాటు కుటుంబ సభ్యుల ఆస్తులు జప్తు చేస్తామన్నారు. ఒడిశా నుంచి గంజాయి రవాణ జరుగుతుందని, దీనిని అరికట్టేందుకు ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. గిరిజన ప్రజలు గంజాయి రవాణ, సాగుకు పూర్తిగా దూరంగా ఉండాలన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకుంటూ వ్యవసాయ పంటలపై దృష్టి సారించాలన్నారు. గంజాయి సాగు, రవాణ వల్ల కలిగే నష్టాలు, కేసులు, శిక్షలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో ఎస్ఐ వెంకట రమణ పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ నుంచి ఏజెన్సీ పోస్టులను మినహాయించాలి

▸▸ గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు అప్పలనర్స



సమావేశంలో మాట్లాడుతున్న అప్పలనర్స

పాడేరురూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్సీ నుంచి ఏజెన్సీ పోస్టులు మినహాయించేందుకు గిరిజన సలహా మండలి(టీఏసీ)లో తీర్మానం చేయాలని గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు పి.అప్పలనర్స డిమాండ్ చేశారు. ఆదివాసీ డీఎస్సీ సాధన కమిటీ, ఆదివాసీ నిరుద్యోగ సంఘం ఆధ్వర్యంలో స్థానిక మోదకొండమ్మ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి సదస్సులో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ అమలుకు గిరిజన సలహా మండలిలో తీర్మానం చేయాలని, ఆదివాసీలకు 100 శాతం రిజర్వేషన్ ఇచ్చిన తరువాతే ఏజెన్సీ ప్రాంత టీచర్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ ఆచరణలో జాప్యం కావడం తో వేలాది మంది ఆదివాసీ నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ప్రభుత్వం కుంటిసాకులు చూపుతూ 50 శాతం, 100 శాతం రిజర్వేషన్ అంటూ గందరగోళం సృష్టిస్తుందని ఆరోపించారు. రాజ్యాంగ విరుద్ధంగా ప్రభుత్వ చర్యలు ఉంటే తీవ్ర ప్రతిఘటన ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పి.బాలదేవ్, ఎస్.ధర్మన్నపడాల్, కూడా రాధాకృష్ణ, ఎస్.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో మార్పులపై ప్రిన్సిపాళ్లకు అవగాహన


సమావేశంలో మాట్లాడుతున్న డీఐఈవో భీమశంకరరావు

పాడేరురూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఈ విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ బోర్డు చేపట్టిన సంస్కరణలు, మార్పులకు సంబంధించి జిల్లాలోని జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్ల సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో అవగాహన కార్యక్రమాన్ని చేపట్టామని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి భీమశంకరరావు తెలిపారు. ఈ సమావేశంలో సిలబస్‌ను సెంట్రల్ సిలబస్‌కు అనుకూలంగా రివిజన్ చేయడం జరిగిందన్నారు. 24 సబ్జెక్టుతో కొత్త గ్రూపు కాంబినేషన్ సబ్జెక్ట్ పరిచయం చేయడం జరిగిందన్నారు. మార్క్స్ డిస్ట్రిబ్యూషన్ 2, 4, 6, 8గా కొన్ని సబ్జెక్ట్‌కి కొత్తగా పరిచయం చేశారన్నారు. ప్రశ్న పత్రం తయారీలో కొన్ని సబ్జెక్ట్‌లో మార్పులు తీసుకురావడం జరిగిందన్నారు. విద్యార్థులకు ముందుగా అవగాహన కల్పించాలని ప్రిన్సిపాల్స్‌కు ఆదేశించామన్నారు.

మధ్యాహ్న భోజన పథకం పక్కాగా అమలుచేయండి

జిల్లా విద్యా శాఖాధికారి బ్రహ్మాజీ


ఉన్నత పాఠశాల హెచ్‌ఎంతో మాట్లాడుతున్న డీఈవో

అరకులోయ, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన పథకాన్ని పక్కాగా అమలు చేయాలని జిల్లా విద్యా శాఖాధికారి బ్రహ్మాజీ ఆదేశించారు. అరకులోయ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా భోజన పథకం అమలు తీరును, వంటశాలలో విద్యార్థులకు సిద్ధం చేసిన ఆహార పదార్థాలను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి భోజన పథకం మెనూ అమలు తీరు, ఆహారా పదార్థాల నాణ్యత గురించి ఆరా తీశారు. అనంతరం పాఠశాలలో రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, చక్కటి విద్యా బోధనతో విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలని సూచించారు. తద్వారా విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపర్చాలని ఆయన స్పష్టం చేశారు.

ఎఫ్ఎల్ఎన్ లీడర్‌షిప్ శిక్షణ శిబిరం పరిశీలన

బోసుబెడ్డ సమీపంలోని ఓ ప్రైవేటు రిసార్టులో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న ఎఫ్ఎల్ఎన్ లీడర్‌షిప్ శిక్షణ శిబిరాన్ని డీఈవో బ్రహ్మాజీ పరిశీలించారు. సోమవారం రెండో బ్యాచ్ ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా శిక్షణకు విచ్చేసిన ఉపాధ్యాయులతో డీఈవో మాట్లాడుతూ ఈ శిక్షణ నాయకత్వ లక్షణాలను మరింత పెంచుతుందని, ఎంతగానో ఉపయోగపడుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో వి.త్రినాథ్‌రావు, హెచ్‌ఎం మెహనరావు పాల్గొన్నారు.

అధ్యక్ష, కార్యదర్శి ఎన్నిక నిర్వహించాలి

▸▸ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లాకు అనంతగిరి నేతల వినతి


టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లాకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

అనంతగిరి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 24 పంచాయతీలకు సంబంధించి గ్రామ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఎన్నిక పూర్తయినప్పటికీ.. పార్టీ మండల టీడీపీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఎన్నిక నిర్వహించకుండా జాప్యం చేస్తున్నారని టీడీపీ సీనియర్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ నెల 24వ తేదీన టీడీపీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఎన్నిక నిర్వహించాల్సి ఉండగా, ఒక వర్గానికి కొమ్ముకాస్తూ ఏకపక్ష నిర్ణయంతో నియోజకవర్గ పరిశీలకుడు ఎన్నిక వాయిదా వేసి వెళ్లిపోయారని వివరించారు. వాయిదాలు లేకుండా వెంటనే ఎన్నిక నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. దీనిపై పల్లా శ్రీనివాసరావు సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో నాయకులు గాలి నరసింహమూర్తి, ఎ.బుజ్జిబాబు, టి.ఆనందరావు, జోగులు, దొన్ను, నిర్మల, లక్ష్మణరావు, దయానిధి శ్యామ్, సుందరరావు పాల్గొన్నారు.

చంపాపట్టి వంతెనకు రూ.5 కోట్లు

డుంబ్రిగుడ, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం చొరవతో తుఫాన్‌కు కొట్టుకుపోయిన చంపాపట్టి వంతెన నిర్మాణానికి రూ.5 కోట్లు మంజూరయ్యాయని టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు సుబ్బారావు, మాజీ ఎంపీపీ దన్నేరావు, నాయకులు స్వామి, బాస్కరరావు తెలిపారు. ఈ వంతెనను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హుద్‌హుద్ తుఫాన్ ప్రభావంతో కాజ్‌వే కొట్టుకుపోయిందన్నారు. వైసీపీ ప్రభుత్వం వంతెన నిర్మాణానికి శిలాఫలాకాన్ని ఆవిష్కరించి నిధుల మంజూరులో నిర్లక్ష్యం చేసిందన్నారు. గెడ్డ అవతలి గ్రామాల గిరిజనులు గెడ్డ దాటే క్రమంలో ప్రాణాలు పోగొట్టుకునే దుస్థితి ఉందన్నారు. వంతెన నిర్మాణానికి సీఎం చంద్రబాబు, గిరిజన మంత్రి సంధ్యారాణి, జీసీసీ చైర్మన్ శ్రావణ్‌కుమార్, ఆర్టీసీ రీజియన్ చైర్మన్ దొన్నుదొర తమవంతు కృషి చేశారన్నారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు మఠం భీమరాజు, రవి పాల్గొన్నారు. అలాగే పోతంగి పంచాయతీ గ్రామ కమిటీ అధ్యక్షుడు భీమరాజు ఆధ్వర్యంలో సుపరి పాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు పాల్గొన్నారు.


కొట్టుకుపోయిన వంతెనను పరిశీలిస్తున్న నాయకులు

కొయ్యూరులో 32.2 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత

పాడేరు, జూలై 28(ఆంధ్రజ్యోతి): మన్యంలో గరిష్ఠ ఉష్ణోగ్రతల్లో స్వల్ప మార్పు కన్పిస్తున్నది. దీంతో సోమవారం కొయ్యూరులో 32.2 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదుకాగా అనంతగిరిలో 27.9, చింతపల్లిలో 27.5, అరకులోయలో 25.2, జి.మాడుగుల, జీకేవీధిలో 24.8, పాడేరులో 24.6, హుకుంపేటలో 24.4, డుంబ్రిగుడలో 23.6, ముంచంగిపుట్టులో 22.9 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

చలో విజయవాడ పోస్టర్ ఆవిష్కరణ


సీలేరులో జెన్‌కో కార్మికులు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

సీలేరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): సీలేరులో సోమవారం స్థానిక జెన్‌కో డివిజనల్ (ఓఅండ్ఎం) కార్యాలయం ఎదుట జెన్‌కో కాంట్రాక్టు కార్మికులు ఆగస్టు 7న నిర్వహించే చలో విజయవాడ కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరించారు. స్థానిక సీఐటీయూ బ్రాంచి అధ్యక్షుడు బి.లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని, 2022లో పీఆర్‌సీ ఎరియర్స్ ఇవ్వాలని, జీతాల్లో వ్యత్యాసం లేకుండా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని తదితర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బ్రాంచి కార్యదర్శి టి. విష్ణుకుమార్‌రాజు పాల్గొన్నారు.

జర్రెల కొత్తూరులో వంతెన నిర్మించాలి

▸▸ టీడీపీ మండలాధ్యక్షుడు పొత్తూరు కొండలరావు


కల్వర్టును పరిశీలిస్తున్న టీడీపీ మండలాధ్యక్షుడు కొండలరావు

గూడెంకొత్తవీధి, జూలై 28 (ఆంధ్రజ్యోతి):మండలంలోని జర్రెల కొత్తూరు వంతెన నిర్మించాలని కలెక్టర్ దృష్టికి తీసుకువెళతానని టీడీపీ మండలాధ్యక్షుడు పొత్తూరు కొండలరావు కోరారు. సోమవారం ఆయన జర్రెల పంచాయతీలో పర్యటించారు. జె.రాళ్లగెడ్డ గ్రామంలో వర్షాలకు కూలిపోయిన లక్ష్మణరావు గృహాన్ని, జర్రెల కొత్తూరు కల్వర్టుని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలకు గృహాలు నష్టపోయిన ఆదివాసీలకు అధికారులు పరిహారం అందజేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు సాగిన అనిల్ కుమార్, మత్స్యరాజు, భూపతి, రవి, వీఆర్వో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

తల్లికి వందనం ఈకేవైసీ చేయించాలి : ఎంపీడీవో

గూడెంకొత్తవీధి, జూలై 28 (ఆంధ్రజ్యోతి):తల్లికి వందనం పెండింగ్ ఈకేవైసీలను సకాలంలో పూర్తి చేయాలని స్థానిక ఎంపీడీవో వై. ఉమామహేశ్వరరావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులందరికీ తల్లికి వందనం ప్రభుత్వం అందించడం జరుగుతుందన్నారు. బర్త్ సర్టిఫికెట్, ఆధార్ కార్డులేని చిన్నారులను గుర్తించి వెంటనే కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పక్కా గృహాల నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో రమేశ్ పాల్గొన్నారు.

‘సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి’

చింతపల్లి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని తాజంగి పీహెచ్‌సీ వైద్యాధికారి భవాని అన్నారు. సోమవారం స్థానిక కస్తూర్బాగాంధీ విద్యాలయంలో విద్యార్థినులకు ఆయన ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వాతావరణంలో కలిగిన మార్పు వల్ల విద్యార్థులకు జలుబు, దగ్గు, జ్వరం, గొంతునొప్పి, అతిసార వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నదన్నారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థినుల ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుధామాధురి, ఎంపీహెచ్ఈవో స్వామి, హెచ్ఎస్ ప్రసాద్, క్షయ సూపర్‌వైజర్ ప్రసాద్ పాల్గొన్నారు.

జి.మాడుగులలో..

జి.మాడుగుల, జూలై 28 (ఆంధ్రజ్యోతి): సీజన్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని స్థానిక వైద్యాధికారి నారాయణ విద్యార్థులకు సూచించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల చైర్మన్ ఎల్.రామకృష్ణ సూచన మేరకు సోమవారం హైస్కూల్‌లో ప్రత్యేక వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. పాఠశాల విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వ్యక్తిగత పరిశుభ్రతలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం నాగరాజు, పెసా కమిటీ నాయకుడు మణికంఠ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై కంట్రోల్ రూమ్ ఏర్పాటు

జి.మాడుగుల, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ సమస్యలను కంట్రోల్ రూమ్ ద్వారా పరిష్కరించుకోవచ్చునని ఎంపీడీవో ఎస్.డేవిడ్‌రాజు పేర్కొన్నారు. మండలంలోని విద్యుత్ వినియోగదారులు 9490610027 నంబరుకు ఫోన్ చేసి, తమ సమస్యలు అడిగి నివృత్తి చేసుకోవాలని ఆయన సూచించారు.

వ్యాపారులు చెత్త బుట్టలు ఏర్పాటు చేసుకోవాలి

ముంచంగిపుట్టు, జులై 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వ్యాపారులు దుకాణాల వద్ద చెత్త బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీవో సూర్యనారాయణమూర్తి ఆదేశించారు. సోమవారం అధికారులు దగ్గరుండి మురుగు నిల్వలను తొలగించే పనులను చేయించారు. అలాగే పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్ నిషేధంపై మైక్ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధం అమలును అందరూ తప్పకుండా పాటించాలని స్పష్టం చేశారు. నిషేధాన్ని అతిక్రమిస్తే రూ.2500 వరకు జరిమానా విధించడం జరుగుతుందని హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయరాదని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎస్.సుభాశ్, ఈవోపీఆర్‌డీవో చిన్నా, పంచాయతీ కార్యదర్శి సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేత సుభాశ్ మృతి

ముంచంగిపుట్టు, జులై 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పనసపుట్టు పంచాయతీ కడుతుల గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు జి.సుభాశ్ అనారోగ్యంతో బాధపడుతూ విశాఖలోని ఓ ఆస్పత్రిలో ఆదివారం మృతి చెందారు. అతని స్వగ్రామంలో సోమవారం అంత్యక్రియలు జరిగాయి. సుభాశ్ భౌతికకాయాన్ని కడసారిగా చూసేందుకు వివిధ పార్టీల నాయకులు, బంధువు, కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. టీడీపీ డివిజన్ నేత పి.పాండురంగస్వామి, పార్టీ రాష్ట్ర ఎస్టీసెల్ కార్యదర్శి జి.రామ్మూర్తి, పార్టీ మండల అధ్యక్షులు కె.సన్యాసమ్మ, మాజీ మండల అధ్యక్షులు కె.బలరాం, సీపీఎం మండల కార్యదర్శి కె.త్రినాథ్ తదితరులు సుభాశ్‌కు నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి సానుభూతిని తెలిపారు.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

పెదబయలు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం పెదబయలు సమీపంలోని సీతగుంట జంక్షన్ వద్ద సోమవారం ఓ వాహనానికి త్రుటిలో ప్రమాదం తప్పింది. ఒడిశా రాష్ట్రం నందపూర్ నుంచి పెదబయలు వారపు సంతకు బంగళదుంప లోడుతో వస్తున్న బొలేరో వాహనం సీతగుంట జంక్షన్ వద్ద రహదారి ఎక్కుతుండగా లోడ్ అధికం కావడంతో లోయలోకి పడబోయింది. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి రెప్పపాటు సమయంలో వాహనాన్ని ఆపడంతో ప్రమాదం తప్పింది. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ పరిశీలకులు ఏసుదాసు
- గ్రామాల్లో ఉత్సాహంగా 'సుపరిపాలనలో తొలి అడుగు'

కె.కోటపాడు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తున్నదని తెలుగుదేశం పార్టీ మాడుగుల నియోజకవర్గ పరిశీలకులు వాసిరెడ్డి ఏసుదాసు అన్నారు. మండలంలోని కె.కోటపాడు, గొండుపాలెం గ్రామాల్లో సోమవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని పార్టీ నాయకులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసుదాసు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆంధ్రప్రదేశ్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి చర్యలు చేపడుతున్నారన్నారు. సంవత్సరం కాలంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ కార్యక్రమాల కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ రొంగలి మహేశ్, నాయకులు దాడి ఎరుకునాయుడు, జూరెడ్డి రాము, వంటాకు శ్రీను, కన్నూరు సూర్యనారాయణ, బండారు దేముడుబాబు, వెలగల పైడిమ నాయుడు, ఈర్లి రమేశ్, చిరంజీవి, త్రినాథ్, సంతోశ్, ప్రవీణ్ పాల్గొన్నారు.


కె.కోటపాడులో సంక్షేమ పథకాల కరపత్రాలను చూపుతున్న ప్రజలు, నాయకులు

బుచ్చెయ్యపేటలో...

బుచ్చెయ్యపేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో సీతయ్యపేట గ్రామంలో సోమవారం 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఎంవీవీ.సత్యనారాయణ, నాయకులు దాకవరపు నాగేశ్వరిదేవి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల కరపత్రాలను పంపిణీ చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చుతున్నామని చెప్పారు. అలాగే సమస్యలు తెలిపితే వెంటనే పరిష్కరించే దిశగా చర్యలు చేపడతామని ప్రజలక వారు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కరణం నాగేశ్వరరావు, వజ్రపు శ్రీను, మందపాటి వెంకటపతి రాజు, పిల్లా రమణ, కిల్లంపల్లి శ్రీను పాల్గొన్నారు.


సీతయ్యపేటలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల కరపత్రాల ప్రదర్శన

వైసీపీ ఫేక్ ప్రచారాలను తిప్పికొట్టండి

- ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు
- టీడీపీ సోషల్ మీడియా ఇన్‌చార్జిగా శ్రీరామ్మూర్తి


సోషల్ మీడియా ఇన్‌చార్జి శ్రీరామ్మూర్తిని అభినందిస్తున్న ఎమ్మెల్యే రాజు

చోడవరం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ పాలనపై వైసీపీ సాగిస్తున్న ఫేక్ ప్రచారాలను తిప్పికొట్టాలని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు సూచించారు. నియోజకవర్గ టీడీపీ సోషల్ మీడియా ఇన్‌చార్జిగా నియమితులైన బుచ్చెయ్యపేట మండలం వడ్డాదికి చెందిన శిరిగిరిశెట్టి శ్రీరామ్మూర్తిని సోమవారం స్థానిక ఎమ్మెల్యే అభినందిస్తూ సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ నేతలు కూటమి ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు చేస్తూ బురద జల్లే కార్యక్రమాలను పనిగా పెట్టుకున్నారన్నారు. వైసీపీ మూకలు సాగిస్తున్న ఈ దుష్ప్రచారానికి టీడీపీ సోషల్ మీడియా విభాగం కార్యకర్తలు అడ్డుకట్ట వేయాలని సూచించారు. అలాగే కూటమి ప్రభుత్వం ప్రజలకు అమలు చేస్తున్న, సంక్షేమ అభివృద్ధి పథకాలపై విస్తృత ప్రచారం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, బుచ్చెయ్యపేట మండల టీడీపీ నాయకులు డొంకిన అప్పలనాయుడు, గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ బైలా ప్రకారం నడుచుకోండి

- మత్స్య శాఖ ఏడీ టి.నాగమణి


రావణాపల్లి రిజర్వాయర్ కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న ఏడీ నాగమణి

గొలుగొండ, జూలై 28 (ఆంధ్రజ్యోతి): రావణాపల్లి రిజర్వాయర్‌కు సంబంధించి స్వదేశీ మత్యకారుల సొసైటీ కమిటీ బైలా ప్రకారం సభ్యులు నడుచుకోవాలని మత్స్య శాఖ ఏడీ టి.నాగమణి ఆదేశించారు. నర్సీపట్నం మత్యశాఖ కార్యాలయంలో రావణాపల్లి రిజర్వాయర్ కమిటీ సభ్యులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రావణాపల్లి రిజర్వాయర్‌లో రెండు నెలల క్రితం సొసైటీ చైర్మన్ నక్కా రమణ, డైరెక్టర్లు, సభ్యులు 20 లక్షల చేప పిల్లలను రిజర్వాయర్‌లో వదిలారని, ఆరు నెలల వరకు ఇలా వదలకూడదని, అప్పటివరకు సభ్యులు వివాదాలకు పోకూడదని ఆమె సూచించారు. చేప పిల్లలను రిజర్వాయర్‌లో వదలకూడదని 120 మంది సభ్యులు తీర్మానం చేసి అధికారికి అందించారు.

మహిళా వికాసంతోనే స్వయం సమృద్ధి

- చోడవరం సీఐ బి.అప్పలరాజు


వికాస బ్యాంకు ప్రగతి నివేదిక విడుదల చేస్తున్న సీఐ

చోడవరం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మహిళా వికాసంతోనే స్వయం సమృద్ధి సాధ్యమని సీఐ బి.అప్పలరాజు అన్నారు. స్థానిక వికాస మహిళా పరస్పర సహకార బ్యాంకు 26వ వార్షిక మహాసభను సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. గ్రామీణ ప్రాంతంలో వికాస మహిళా పరస్పర సహకార బ్యాంకు స్వయం సమృద్ధి సాధించడం మహిళల సత్తాకు నిదర్శనమని ప్రశంసించారు. సంఘం ప్రగతి, సభ్యుల సంక్షేమం, పొదుపు గురించిన అంశాలు పరిశీలించి అభినందించారు. ఈ మహాజన సభ సందర్భంగా బ్యాంకు కొత్త అధ్యక్షురాలిగా మాడిసి వెంకటలక్ష్మి, డైరెక్టర్లుగా నారం మణి, గోగునుపూడి వరలక్ష్మి, అడిగర్ల నాగలక్ష్మి, కోడూరు నాగమణిలను సభ్యులు ఎన్నుకున్నారు. కార్యక్రమంలో విశాఖ కోఆపరేటివ్ బ్యాంకు మేనేజర్ జీవీఎస్ఎన్ మూర్తి, డాక్టర్ పద్మావతి పాల్గొన్నారు. ఈ సమావేశానికి బ్యాంకు ఎండీ కోన సరోజ అధ్యక్షత వహించారు.

మాడుగులలో దుకాణాలకు కొళాయిలు!

నిబంధనలకు విరుద్ధంగా జలజీవన్ మిషన్ పథకంలో ఏర్పాటు

మాడుగుల, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఇంటింటికీ కొళాయి కనక్షన్‌లు అందించే సదుద్దేశంతో ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా జల్‌జీవన్ మిషన్ పథకానికి శ్రీకారం చుట్టింది. పట్టణం, మండలాల్లోని గ్రామాల్లో ఈ పథకం ద్వారా ఇంటింటికీ కొళాయి కనెక్షన్లు ఇస్తున్నారు. ఇందుకోసం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు ఇంటి పన్నును ప్రామాణికంగా తీసుకుంటున్నారు. పన్ను ఉన్న ప్రతీ ఇంటికి కొళాయి కనక్షన్‌లను ఏర్పాటు చేస్తున్నారు. అనంతరం నిర్వహణ బాధ్యతలకు పంచాయతీలకు అప్పగిస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా, మాడుగులలో మాత్రం నిబంధనలకు విరుద్ధంగా దుకాణాలకు కనెక్షన్లు ఇస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిర్వహణ విషయం పక్కన పెట్టిన పంచాయతీ పాలకవర్గం, కమర్షియల్ షాపులకు కూడా (ఎలాంటి పన్ను పంచాయతీకి చెల్లించని వారికి) కొళాయి కనక్షన్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ఈ విషయమై పంచాయతీ సర్పంచ్‌తో పాటు కార్యదర్శిని వివరణ కోరగా, కొత్తగా విధుల్లో చేరినట్టు కార్యదర్శి బదులిచ్చారు. సర్పంచ్ యడ్ల కళావతి మాత్రం తానే కనక్షన్‌లను వేయాలని సిబ్బందికి సూచించానని చెప్పారు.

రహదారి అధ్వానం.. రాకపోకలు నరకప్రాయం!

అస్తవ్యస్తంగా జి.వెంకటాపురం రోడ్డు

- మార్గమధ్యంలో పెద్ద పెద్ద గోతులు.. తేలిపోయిన రాళ్లు
- రాకపోకలకు వాహన చోదకులు, ప్రయాణికుల అగచాట్లు
- పట్టించుకోని అధికారులు, ప్రజా ప్రతినిధులు


భారీ గతుకులతో ఉన్న జి.వెంకటాపురం రహదారి

మాకవరపాలెం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జి.వెంకటాపురం రోడ్డు అధ్వానంగా తయారైంది. ఈ రహదారిలో క్వారీ లారీలు తిరగడంతో మార్గమధ్యంలో పెద్ద పెద్ద గోతులు పడ్డాయి. ఇటీవల కురిసిన వర్షాలకు ఈ గోతుల్లో నీరు చేరింది. దీంతో వాహనదారులు గోతులు అంచనా వేయలేక ఇబ్బందులు పడుతున్నారు.

రామన్నపాలెం సెంటరు నుంచి జి.వెంకటాపురం వరకు ఈ రోడ్డు పూర్తిగా గోతులగా మారింది. ప్రసుత్తం రోడ్డుపై రాళ్లు తేలి ఉండటంతో వాహనదారులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. ఆటోవాలాలు ఈ ప్రాంతాలకు వెళ్లేందుకు వెనుకడుగు వేస్తున్నారు. రోడ్డు సరిగా లేకపోవడంతో స్థానిక ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు. అయినప్పటికీ పాలకులు, అధికారులు పట్టించుకునే పాపానికి పోవడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఈ రోడ్డు అభివృద్ధి చేయాలని, మార్గమధ్యంలోని గోతులు పూడ్చివేయాలని స్థానిక ప్రజలు, వాహన చోదకులు వేడుకుంటున్నారు.

సమస్యలను సత్వరమే పరిష్కరించండి

- ఆర్డీవో వీవీ.రమణ
- పీజీఆర్ఎస్‌కు 20 వినతులు


పీజీఆర్ఎస్‌లో వినతిపత్రాలను పరిశీలిస్తున్న ఆర్డీవో వీవీ రమణ

నర్సీపట్నం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో వచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆర్డీవో వీవీ.రమణ ఆదేశించారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 20 అర్జీలు వచ్చాయి. వీటిని ఆర్డీవో స్వీకరించి పరిశీలించారు. గొలుగొండ మండలం పుత్తడి గైరంపేట పంచాయతీలోని పీఎస్‌డీపాలెం బీటీ రోడ్డు, కల్వర్టు పాడవ్వడంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నామని గ్రామస్థులు ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. అలాగే నర్సీపట్నం వెంకునాయుడుపేటకి చెందిన గొల్లపల్లి సత్తిబాబు ఇచ్చిన వినతిపత్రంలో తను కూలి పని చేసుకుంటూ బతికేవాడని, ఇటీవల ప్రమాదంలో కాలు విరిగిపోయిందని, పని చేసుకునే పరిస్థితిలో లేని తనకు ఇంటి స్థలం, పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. శ్మశాన వాటికకు వెళ్లేందుకు ఉపయోగిస్తున్న గెడ్డ గోర్జు దారి ఆక్రమణ జరగకుండా చూడాలని రోలుగుంట మండలం రత్నంపేట పంచాయతీ పనసలపాడు గ్రామస్థులు జి.లోవరాజు తదితరులు వినతిపత్రం అందజేశారు. ఎస్.రాయవరం మండలం పెద్దగుమ్మలూరు శివారు సీలాద్రిపురం, సీతారామపురంలో డిపట్టా భూములు ఆన్‌లైన్ చేయాలని రైతులు కోరారు. ఈ వినతిపత్రాలను పరిశీలించిన ఆర్డీవో, సత్వర పరిష్కారానికి కృషి చేయాలని మండల స్థాయి అధికారులకు ఆదేశించారు.

వంతెనలు నిర్మించాలని గిరిజనుల ఆందోళన



రోడ్లు, వంతెనలు నిర్మించాలని తాడివలస గెడ్డలో దిగి నిరసన తెలుపుతున్న గిరిజనులు... నర్సీపట్నం ఆర్డీవో కార్యాలయం ఎదుట డప్పులతో గ్రామస్థుల నిరసన

మాడుగుల, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మారుమూల గిరిజన గ్రామాలకు రహదారులతో పాటు వంతెనలు నిర్మించాలని గిరిజనులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మండలంలోని తాడివలస గెడ్డలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం ఐదో షెడ్యూల్ సాధన కమిటీ జిల్లా కార్యదర్శి ఇరటా నరసింహమూర్తి మాట్లాడుతూ శంకరం పంచాయతీలోని తాడివలస, గొప్పూరు, రాయిపాలెం, రాజంపేట, వెలగలపాడు, కొత్తవలస, మామిడిపాలెం తదితర గ్రామాలకు రోడ్డు సదుపాయం లేక రాకపోకలు సాగించేందుకు గిరిజనులు అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికితోడు కొత్తవలస, తాడివలస, మామిడిపాలెం గ్రామ సమీపంలో గెడ్డలు, వాగులు ఉన్నప్పటికీ వంతెనల నిర్మాణాలు చేపట్టలేదన్నారు. దీని కారణంగా అత్యవసర సమయాల్లో పట్టణ ప్రాంతాలకు పోవాలన్నా, గర్భిణులను ఆస్పత్రికి తరలించాలన్నా డోలీమోత తప్పడం లేదని వాపోయారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి ఆయా గ్రామాల్లో రోడ్లతో పాటు వంతెనలు నిర్మించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.భవానీ, గట్టూరి అప్పారావు, సన్యాసమ్మ, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్వారీ నిలిపివేయాలని డప్పులతో నిరసన

నర్సీపట్నం అర్బన్: మండలంలోని జి.కోడూరు గ్రామంలో క్వారీ తవ్వకాలను తక్షణమే నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక ప్రజలు నిరసన తెలిపారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం డప్పులు వాయిస్తూ ఆందోళనకు దిగారు. జి.కోడూరు రాయి క్వారీకి సంబంధించి సర్వే నంబరు 332లో లీజును రద్దు చేయాలని ఈ సందర్భంగా వారు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో జి.కోడూరు గ్రామస్థులు, బీఎస్పీ రాష్ట్ర కమిటీ సభ్యుడు నాగరాజు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం


లింగంపేట గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్ఐ తారకేశ్వరరావు

కృష్ణాదేవిపేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ వై.తారకేశ్వరరావు సూచించారు. లింగంపేట గ్రామస్థులతో ఆదివారం రాత్రి నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. మోసపూరిత కాల్స్, మెసెజ్‌లతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. సామాజిక మాధ్యమాలు, ఫోన్లు, వాట్సాప్‌లో ప్రభుత్వ అధికారులు, పోలీసులు, బ్యాంకు, విద్యుత్ బీమా సంస్థల పేరుతో కేవైసీ చేసుకోవాలని వస్తున్న కాల్స్, మెసెజ్‌లపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇటువంటి ఫోన్లు ఎత్తకూడదని, లింకులకు క్లిక్ చేయవద్దని ఎస్ఐ చెప్పారు. అలాగే గ్రామాల్లో దొంగతనాలపై జాగ్రత్తగా ఉండాలని, కొత్త వ్యక్తులు సంచరిస్తే తమకు వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తోకల సంతోశ్, మాజీ సర్పంచ్ పరవాడ అప్పలనాయుడు, నర్సీపట్నం మార్కెట్ యార్డు డైరెక్టర్ సలాదుల దేవి, జనసేన, టీడీపీ, వైసీపీ నాయకులు సలాదుల ప్రసాద్, రమణ, శ్రీకాంత్, మల్లేశ్వరరావు, ప్రసాద్, నాయుడు పాల్గొన్నారు.

సీతాఫలాలకు మంచి ధర

- కావిడ రూ.వెయ్యి నుంచి రూ.1500

మాడుగుల, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మాడుగుల వారపు సంతలో సోమవారం సీతాఫలాలకు మంచి ధర పలికింది. పాడేరు ఏజెన్సీలోని దేవాపురం, చలుగు, కందులపాలెం, కక్కి, పులుసుమామిడి, ఈదులపాలెం తదితర గ్రామాల నుంచి సీతాఫలాలను సోమవారం వారపు సంతలో విక్రయించేందుకు రైతులు తీసుకువచ్చారు. సంత ప్రారంభ దశలో వీటికి మంచి ధర పలికింది. పెద్ద సైజు కావిడి రూ.1500 వరకు విక్రయించగా, చివరి దశలో రూ.వెయ్యి నుంచి రూ.1200కు కొనుగోలు చేశారు. అయితే ధర కొంతవరకు పర్వాలేదుగాని, పంట ప్రారంభం దశ కావడం.. గిరిజనులు తక్కువ ఫలసాయం తీసుకురావడం.. కొనుగోలుదారులు కూడా తక్కువగానే రావడంతో ఆశించిన మేరకు రాలేదని గిరిజన రైతులు పేర్కొన్నారు.


మాడుగుల సంతలో విక్రయిస్తున్న సీతాఫలాలు

బ్రిటీష్ సైనిక అధికారుల స్థలాన్ని కాపాడాలి

నర్సీపట్నం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): బ్రిటీష్ సైనికాధికారుల స్థలాన్ని ఆక్రమణదారుల నుంచి కాపాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరావు డిమాండ్ చేశారు. మెయిన్ రోడ్డును ఆనుకొని ఉన్న సమాధుల స్థలాన్ని సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టౌన్ ప్లానింగ్ అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మాణాలు జరుగుతుంటే అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. అల్లూరి సీతారామరాజు ఉద్యమ స్ఫూర్తికి చిహ్నంగా ఉన్న బ్రిటీష్ సైనికాధికారుల సమాధుల స్థలంలో అక్రమ నిర్మాణాలు జరుగుతుంటే అధికారులు చోద్యం చూడడం సరికాదన్నారు. పత్రికల్లో కథనాలు వస్తున్నా అధికారులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. అధికారులు చర్యలు తీసుకోకపోతే ప్రజానీకాన్ని కలుపుకొని ఉద్యమం చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎ.రాజు, ఎస్.నారాయణమూర్తి, ఈరెల్లి చిరంజీవి పాల్గొన్నారు.

'ఉపాధ్యాయులపై పీ4 బాధ్యతల ఒత్తిడి సరికాదు'

నర్సీపట్నం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పీ-4 కార్యక్రమంలో విద్యార్థులను ఉపాధ్యాయులు తప్పనిసరిగా దత్తత తీసుకోవాలని అధికారులు ఒత్తిడి చేయడం సరికాదని పీఆర్‌టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు అడిగర్ల వరహాలనాయుడు, జీవీ.రమేశ్ అన్నారు. సోమవారం వారు మాట్లాడుతూ పీ-4 కార్యక్రమంలో హెచ్‌ఎంలు ఐదు కుటుంబాలను, ఉపాధ్యాయులు రెండు కుటుంబాలను దత్తత తీసుకొని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని లింక్‌లు పంపి, రెండు రోజుల్లో ప్రక్రియ పూర్తిచేయాలని చెబుతున్నారన్నారు. అలాగే బదిలీల్లో సర్దుబాటుకు గురైన ఉపాధ్యాయులు రెండు నెలలుగా జీతాలు పొందలేకపోతున్నారని, వారి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పీ-4లో దత్తత తీసుకోవడానికి ఉపాధ్యాయులు, ఉద్యోగులు స్వచ్ఛందంగా ముందుకు వస్తే స్వాగతిస్తామన్నారు.

రాయితీ దాణాకు ఎదురుచూపులు

నాతవరం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రాయితీపై అందించే దాణా కోసం పాడి రైతులు ఎదురుచూస్తున్నారు. గుమ్మిడిగొండ, నాతవరం, జిల్లేడిపూడి తదితర గ్రామాల్లో సగం మంది పాడి రైతులకు మాత్రమే రాయితీ దాణా అందింది. నెలనెలా రాయితీ దాణా ఇస్తామని అధికారులు చెప్పినా, తమకు అందలేదని పలువురు పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు నెలలు కావస్తున్నా రాయితీ దాణా ఇవ్వలేదని వాపోయారు. ఇప్పటికైనా పశు సంవర్ధక శాఖ అధికారులు స్పందించి మండలంలో పాడి రైతులందరికీ రాయితీపై దాణాను ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

కోడి పందెం శిబిరాలపై దాడులు

నాతవరం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎంబీ పట్నం గ్రామంలో కోడి పందెం శిబిరాలపై సోమవారం దాడులు చేసినట్టు ఎస్ఐ సిహెచ్.భీమరాజు తెలిపారు. ఈ దాడుల్లో ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామన్నారు. వీరి నుంచి రెండు కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ చెప్పారు.

పారిశుధ్య కార్మికులకు రూ.16 వేల వేతనం ఇవ్వాలి

చోడవరం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు రూ.16 వేల వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు గూనూరు వరలక్ష్మి డిమాండ్ చేశారు. జీవో నంబరు 138 ప్రకారం పీఎఫ్, ఈఎస్ఐ కోతలు మినహాయించి కార్మికులకు రూ.16 వేలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. ఆస్పత్రుల పరిశుభ్రతలో ప్రాణాలు పణంగా పెట్టి పని చేస్తున్న కార్మికులకు కేవలం రూ.9 వేలు మాత్రమే వేతనాలు ఇస్తున్నారన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ డబ్బులు ఆయా సంస్థలకు సక్రమంగా చెల్లించడం లేదని ఆమె ఆరోపించారు. ఈ విషయంలో ప్రభుత్వం తక్షణమే స్పందించాలని ఆమె కోరారు.

ఘనంగా ప్రకృతి పరిక్షణ దినోత్సవం

నర్సీపట్నం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ ప్రకృతి పరిరక్షణ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నవ్య లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బలిఘట్టం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అలాగే విద్యార్థులకు ప్రకృతి పరిక్షణ మీద అవగాహన కల్పించారు. మొక్కలు నాటించి సంరక్షణ బాధ్యతలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నవ్య లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కర్రి రాంగోపాల్, కార్యదర్శి బేతిరెడ్డి విజయ్, ట్రెజరర్ సుధీర్, పూర్వపు అధ్యక్షులు గొలుసు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి


దేవరాపల్లి తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

చోడవరం/దేవరాపల్లి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు చోడవరం, దేవరాపల్లి మండలాల్లోని తహశీల్దార్లకు వినతిపత్రాలు అందజేశారు. బోర్డు పునరుద్ధరణతో పాటు పెండింగ్‌లో ఉన్న కార్మికుల క్లైములను పరిష్కరించాలని చోడవరం సిద్ధి వినాయక ఎలక్ట్రికల్ ప్లంబింగ్ సంఘం నాయకులు కె.గంగాధరరావు, దాడి శివకుమార్ కోరారు. సంక్షేమ బోర్డు నిధులను గత వైసీపీ ప్రభుత్వం వాడుకున్నదని, ఆ నిధులను తిరిగి బోర్డుకు జమ చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని వారు విన్నవించారు. పెండింగ్‌లో ఉన్న 46 వేలు క్లైయిమ్‌లు పరిష్కరించి, నిధులు మంజూరు చేయాలని దేవరాపల్లిలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు డి.ఈశ్వరరావు, నాయకులు కె.శ్రీనువాసరావు, లెక్కల లక్ష్మి, సుందరరావు డిమాండ్ చేశారు.

ఇంటర్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్

బుచ్చెయ్యపేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): వడ్డాది ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సోమవారం ఆర్థిక శాస్త్రం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ జి.చిన్నారావు తన సొంత నిధులతో ఈ మెటీరియ్ కొనుగోలు చేసి ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమంలో అర్థశాస్త్ర అధ్యాపకులు చీపురపల్లి రామకృష్ణ, హిందీ అధ్యాపకులు నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల కొరత రానివ్వొద్దు

- ముందస్తుగానే ఏర్పాట్లు చేసుకోవాలి
- అధికారులకు కలెక్టర్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఎరువుల కొరత రాకుండా ముందుగానే తగు చర్యలు చేపట్టాలని కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ నుంచి డివిజన్లు, మండలాల వ్యవసాయాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఖరీఫ్‌కు ఎంత మేర ఎరువులు అవసరం అవుతాయో నివేదిక అందజేయాలని మార్క్‌ఫెడ్ అధికారులకు సూచించారు. గ్రామాల్లో ఎరువుల దుకాణాలు, గోదాముల్లో తనిఖీలు నిర్వహించాలన్నారు. ఆయా దుకాణాల్లో ఎరువుల అమ్మకాల వివరాలను ప్రతి శుక్రవారం జిల్లా అధికారులకు సమర్పించాలన్నారు. అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి డెత్ కేసులు, ఆధార్ నంబర్లు, పేర్లు తప్పుగా నమోదైనట్టు అందిన అర్జీలను ఈ నెలాఖరులోగా పరిష్కరించాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి బి.మోహన్‌రావు, మార్క్‌ఫెడ్ డీఎం అరుణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో నాగజ్యోతి సత్తా



బంగారు పతకాలు, ప్రశంసా పత్రం అందుకుంటున్న నాగజ్యోతి

రోలుగుంట, జూలై 28(ఆంధ్రజ్యోతి): జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో బంగారు పతకాలు గెలుచుకున్న పవర్ లిఫ్టర్, క్రీడాకారిణి నాగజ్యోతి మరోసారి తన చాటారు. ఈ నెల 26, 27 తేదీల్లో గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలం రేవేంద్రపాడు జడ్పీ పాఠశాలలో అమరావతి పవర్ లిఫ్టర్స్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో నాగజ్యోతి మూడు బంగారు పతకాలు సాధించారు. ఈ పోటీల్లో వివిధ జిల్లాల నుంచి సుమారు 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. నాగజ్యోతి 74 కేజీల విభాగంలో స్క్వాట్, బెంచ్ ప్రెస్, డెడ్ లిఫ్ట్ విభాగాల్లో అద్భుత ప్రదర్శన కనబరిచి మూడు బంగారు పతకాలు సాధించారు. ఈ సందర్భంగా రోలుగుంట జడ్పీ పాఠశాల హెచ్ఎం శేషగిరిరావు, ఉపాధ్యాయులు ఆమెను అభినందించారు.

బావిలో పడి యువకుడి మృతి

కొత్తూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుంచంగి గ్రామానికి చెందిన యువకుడు ప్రమాదవశాత్తు బావిలోపడి మృతిచెందాడు. అనకాపల్లి రూరల్ ఎస్ఐ జి.రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నడిపల్లి జైకిరణ్ (16) అనకాపల్లిలోని ఒక ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. అయితే సోమవారం కళాశాలకు వెళ్లలేదు. ఉదయం ఎనిమిది గంటల సమయంలో గ్రామానికి సమీపంలో వున్న బావిలో చేపలు పట్టేందుకు వెళ్లాడు. కాగా మధ్యాహ్నం 12 గంటల సమయంలో రైతు ఒకరు బావి పక్క నుంచి వెళుతూ నీటిపై తేలాడుతున్న జైకిరణ్‌ను చూశాడు. ఇంటికి వెళ్లి అతని తల్లి రాజేశ్వరికి చెప్పాడు. ఆమె ఆందోళనతో బావి వద్దకు వచ్చి చూడగా.. కిరణ్ అప్పటికే మృతిచెందాడు. అనంతరం ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. మృతదేహాన్ని బయటకు తీయించి, అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి మార్చురీలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించామని రూరల్ ఎస్ఐ చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

చింతపల్లి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణాపురం గ్రామ సమీపంలో ఆగి వున్న ట్రాక్టర్‌ను ద్విచక్రవాహనం ఢీకొనడంతో ఓ గిరిజనుడు మృతి చెందగా, మరో వ్యక్తి గాయపడ్డాడు. దీనికి సంబంధించి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. ఆదివారం రాత్రి కృష్ణాపురం గ్రామానికి చెందిన కేపారి అముడు(26), కొయ్యూరు మండలం మర్రివాడ పంచాయతీ పిడితమామిడి గ్రామానికి చెందిన సుర్ల గంగరాజు ద్విచక్రవాహనంపై లోతుగెడ్డ జంక్షన్‌కు ప్రయాణమయ్యారు. కేపారి అముడు ద్విచక్రవాహనాన్ని నడుపుతున్నారు. వర్షం పడుతుండడంతో ఒక చేయిని కళ్లపై నీళ్ల పడకుండా అడ్డంగా పెట్టుకుని మరో చేత్తో వాహనం నడుపుతున్నాడు. అయితే లోతుగెడ్డ జంక్షన్-కృష్ణాపురం మార్గమధ్యంలో ట్రాక్టర్ నిలిపి ఉండడాన్ని గమనించలేదు. దానిని బలంగా ఢీకొనడంతో అముడు తీవ్రంగా గాయపడ్డారు. వెనుక కూర్చుకున్న గంగరాజు స్వల్పంగా గాయపడ్డారు. అముడును 108లో చింతపల్లి ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని స్థానిక ఎస్ఐ వెంకటరమణ తెలిపారు.

శిథిలస్థితిలో పశువైద్యశాల



శ్లాబు పెచ్చులు ఊడిపోవడంతో బయటకు కనిపిస్తున్న ఇనుప ఊచలు



శిథిలావస్థకు చేరుకున్న పశువైద్యశాల

- పగుళ్లిచ్చిన గోడలు, శ్లాబ్ నుంచి ఊడిపడుతున్న పెచ్చులు
- వర్షం కురిస్తే కారిపోతున్న భవనం
- బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది

ఎలమంచిలి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాల క్రితం నిర్మించిన స్థానిక పశువైద్య కేంద్రం భవనం శిథిలావస్థకు చేరింది. శ్లాబ్ పెచ్చులు పూడిపోయి ఇనుప ఊచలు బయటకు కనిపిస్తున్నాయి. వర్షం కురిస్తే భవనం కారిపోతున్నది.

ఎలమంచిలి పట్టణంలోని ప్రాంతీయ పశువైద్య కేంద్రంతో మునిసిపాలిటీతోపాటు మండలంలోని అన్ని గ్రామాల రైతులు సేవలు పొందుతుంటారు. ఇక్కడ పశువైద్యాధికారి, మరో ఇద్దరు సిబ్బంది వున్నారు. సచివాలయ వెటర్నరీ అసిస్టెంట్ కూడా సేవలు అందిస్తున్నారు. పశువైద్యం, మందుల సరఫరా, సిబ్బంది కొరత లేనప్పటికీ.. వసతి సమస్య వేధిస్తున్నది. సుమారు ఆరున్నర దశాబ్దాల క్రితం నిర్మించిన భవనంలోనే ఇప్పటికే పశువైద్యశాలను నిర్వహిస్తున్నారు. గోడలు పలుచోట్ల పగుళ్లిచ్చింది. శ్లాబ్ నుంచి పెచ్చులు ఊడిపోయి ఇనుప ఊచలు బయటకు కనిపిస్తున్నాయి. వర్షం కురిస్తే శ్లాబ్ నుంచి నీరు కారుతున్నది. ఉద్యోగులు భయంతో విధులు నిర్వహిస్తున్నారు. కాగా పశువైద్యశాల ఆవరణలోని మందులు నిల్వచేసే గిడ్డంగి గోడ హుద్‌హుద్ తుఫాన్ సమయంలో కూలిపోయింది. అప్పటి నుంచి గోదామును అలాగే వదిలేశారు. భవనం దుస్థితి గురించి పశు సంవర్థక శాఖ ఉన్నతాధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినప్పటికీ మరమ్మతులు చేయించలేదు. కాగా ఎమ్మెల్యే విజయ్‌కుమార్ ఇటీవల అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో పశువైద్యశాఖ భవనం దుస్థితి గురించి ఏడీ డాక్టర్ గంగాధర్ ఆయక దృష్టికి తీసుకెళ్లారు. త్వరలో భవనాన్ని పరిశీలించి, సమస్యను పరిష్కరించేలా చర్యలుచేపడతానని ఎమ్మెల్యే చెప్పారు.



పునర్నిర్మాణానికి నోచుకోని మందుల గోదాము

అర్జీల పరిష్కారంపై దృష్టి సారించాలి

- అధికారులకు కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశం



పీజీఆర్ఎస్‌లో అర్జీదారునితో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్



జిల్లా పోలీసు కార్యాలయంలో అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్‌సిన్హా

అనకాపల్లి కలెక్టరేట్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో అందే అర్జీల పరిష్కారానికి అధికారులు దృష్టి సారించాలని కలెక్టర్ విజయకృష్ణన్ కోరారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో జేసీ జాహ్నవి, డీఆర్ఓ సత్యనారాయణరావులతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం అధికారులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ, పీజీఆర్ఎస్ అర్జీలు ఏ స్థాయి అధికారుల లాగిన్‌లో ఉంటే వాటి పరిష్కార పరిస్థితిని పర్యవేక్షణ చేసి పరిష్కరించాలన్నారు. ప్రజలు దరఖాస్తు చేసుకున్న అర్జీ స్థితిని తెలుసుకునేందుకు 1100 నంబర్‌కు ఫోన్ చేస్తే.. వివరాలను తెలియజేయాలని అధికారులకు సూచించారు. సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో మొత్తం 297 అర్జీలు అందాయని కలెక్టరేట్ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి జి.రామారావు, డీపీవో ఈ. సందీప్, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.హైమావతి, ఎక్సైజ్ శాఖ అధికారి వి.సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో..

అనకాపల్లి రూరల్: పీజీఆర్ఎస్‌లో అందే అర్జీలను సకాలంలో పరిష్కరించాలని ఎస్పీ తుహిన్‌సిన్హా అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన పాల్గొని పౌరుల నుంచి అర్జీలను స్వీకరించారు. పలువురి సమస్యలను స్వయంగా ఆలకించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పీజీఆర్ఎస్ అందిన అర్జీలపై ఏడు రోజులలోపు విచారణ పూర్తి చేసి పరిష్కరించాలన్నారు. మొత్తం 45 అర్జీలు అందాయని జిల్లా పోలీస్ కార్యాలయ అధికారులు తెలిపారు.

ప్రత్యేక హోదా కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం

- ఏఐసీసీ సంయుక్త కార్యదర్శి పాలక్ వర్మ



మాట్లాడుతున్న ఏఐసీసీ సంయుక్త కార్యదర్శి పాలక్ వర్మ

నర్సీపట్నం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి ప్రత్యేక హోదా, హక్కుల సాధన కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని అఖిల భారత కాంగ్రెస్ పార్టీ సంయుక్త కార్యదర్శి, రాష్ట్ర ఇన్‌చార్జి డాక్టర్ పాలక్ వర్మ అన్నారు. సోమవారం రామారావుపేటలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు మీసాల సుబ్బన్న అధ్యక్షతన జిల్లా స్థాయి కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రం విభజన హక్కులు, ప్రత్యేక హోదా సాధించడంలో తెలుగుదేశం, జనసేన పార్టీలు విఫలమయ్యాయని విమర్శించారు. గత వైసీపీ ప్రభుత్వం, ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడం లేదని విమర్శించారు. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలలో ఓటరు జాబితాలో లోపాలు గుర్తించి అధికారుల దృష్టికి తీసుకు వెళ్లామన్నారు. పక్క రాష్ట్రాల్లో ఉన్న వారిని కూడా ఇక్కడ ఓటర్లుగా చేర్చుతున్నారని ఆరోపించారు. స్థానిక ఎన్నికల లోపు అటువంటి ఓటరు జాబితాలో లోపాలు ఉంటే డీసీసీ అధ్యక్షులు ద్వారా అధికారుల దృష్టికి తీసుకు వెళ్లాలని సూచించారు. పార్టీలో కష్టపని పని చేసేవారికి గుర్తింపు ఉంటుందని అన్నారు. గతంలో పార్టీ పదవులు అనుభవించినవారు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారని, ఈ విషయాన్ని పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకు వెళతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లక్కలరాజు రామారావు, రాష్ట్ర ఆదివాసీ కాంగ్రెస్ చైర్మన్ రీముల నవభారత్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఉమామహేశ్వరరావు, మదన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

రైల్వే జోన్‌కు రెడ్ సిగ్నల్స్!

... 5వ పేజీ తరువాయి

రాజు'లా మారింది. పేరుకే ఆయన జోన్ జీఎం. జోన్ పరిధిలోకి వచ్చే డివిజన్లు వాల్తేరు (విశాఖపట్నం), గుంటూరు, గుంతకల్, విజయవాడ డివిజన్లు ఇప్పటికీ వాటి పాత జోన్ పరిధిలోనే నడుస్తున్నాయి. వాల్తేరు తూర్పు కోస్తా రైల్వే పరిధిలో, మిగిలిన మూడు సికింద్రాబాద్ కేంద్రంగా ఉన్న దక్షిణ మధ్య రైల్వే జోన్‌లోనే ఉన్నాయి. ఆ డివిజన్లకు చెందిన రైల్వే మేనేజర్లు ఆయా జోన్ల జీఎంలు చెప్పిన పనులే చేస్తున్నారు. వారితోనే అన్ని రకాల సంప్రతింపులు జరుపుతున్నారు. కేంద్రం గెజిట్ ఇవ్వకపోవడం వల్ల కొత్త జీఎం వారితో అధికారికంగా కార్యకలాపాలు నిర్వహించలేకపోతున్నారు.

జీఎం కార్యాలయం ఖరారుపై దోబూచులాట

జోన్ జీఎంగా సందీప్ మాథుర్‌ని జూన్ మొదటి వారంలో నియమించారు. ఆయన తక్షణమే ఢిల్లీలోనే బాధ్యతలు స్వీకరించారు. ఆ తరువాత విశాఖపట్నం సహా అన్ని డివిజన్లకు వెళ్లి అక్కడి రైల్వే అధికారులతో పరిచయం చేసుకున్నారు. విశాఖలో ఆయనకు ప్రత్యేక కార్యాలయం ఉండాలి. ముడసర్లోవలో కొత్త జోనల్ కార్యాలయం నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. అవి పూర్తయ్యేసరికి రెండేళ్లు పైనే పడుతుంది. అంతవరకూ వేరే భవనాన్ని అద్దెకు తీసుకోవాలని రెండు, మూడు పరిశీలించారు. వాటికి ఆమోదం రావలసి ఉంది. ఆ విషయంలోనూ రైల్వే పెద్దలు తాత్సారం చేస్తున్నారు. ఏదో ఒకటి ఖరారు చేస్తే జీఎం విశాఖలో కూర్చొని కొన్ని పనులైనా చేసుకునే అవకాశం ఉంది. అది సుతారమూ రైల్వే పెద్దలకు ఇష్టం లేదు. అందుకని ఆ జీఎం భవనాన్ని ఖరారు చేయడం లేదు.

కొర్రీలతో డీపీఆర్ ఆమోదం

దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు సంబంధించిన డీపీఆర్‌ను ఈ ఏడాది జనవరి నెలాఖరులో ఢిల్లీకి పంపితే ఆరు నెలలు దానిని ముగబెట్టి వారం క్రితం కొర్రీలతో ఆమోదించారు. రాయగడ కేంద్రంగా కొత్త డివిజన్ ఇచ్చేశారు. ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులోయ విశాఖపట్నం జోన్ నుంచి రాయగడలోకి వెళ్లిపోయింది. పార్వతీపురం సమీపానున్న కూనేరు కూడా రాయగడ డివిజన్‌కే ఇచ్చేశారు. కొత్తవలస నుంచి పలాస వరకు విశాఖపట్నం డివిజన్‌లో ఉంచారు. పలాస నుంచి ఇచ్ఛాపురం వరకూ ఆంధ్రప్రదేశ్‌కు చెందిన స్టేషన్లన్నీ తూర్పు కోస్తా జోన్‌లోని ఖుర్దా డివిజన్‌లో ఉండిపోయాయి.

ఆర్ఆర్‌బీపై చర్చ శూన్యం

రైల్వేలో ఉద్యోగ అవకాశం రావాలంటే రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు (ఆర్ఆర్‌బీ) నిర్వహించే పరీక్షలు రాయాలి. వాటికి హాజరయ్యేందుకు ఒడిశాలోని భువనేశ్వర్‌కు వెళితే...'ఆంధ్రావాళ్లు' అని వెనక్కి పంపించేసేవారు. ఆ నేపథ్యంలోనే విశాఖ కేంద్రంగా జోన్ ఏర్పాటుచేస్తే ఇక్కడే ఆర్ఆర్‌బీ కేంద్రం వస్తుందని యువత భావించింది. ఇప్పుడు జోన్ ప్రకటించినా ఇంకా ఆర్ఆర్‌బీ కేంద్రం ఇవ్వలేదు. దీనిపై ఎవరూ మాట్లాడడం లేదు. రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్‌గా అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ వ్యవహరిస్తున్నారు. ఆయన జోన్ కార్యకలాపాల వేగవంతంపైన, ఆర్ఆర్‌బీ వంటి అంశాలపైనా దృష్టి సారించాలి. ఆయన ప్రయత్నిస్తే అన్నింటికీ వెనువెంటనే ఆదేశాలు వస్తాయి.

నిబంధనలకు పాతర

... 5వ పేజీ తరువాయి

పొరలుగా గ్రావెల్ వేసి, రోలర్‌తో బలంగా చదును చేయించాలి. తరువాత కంకరవేసి మరోసారి రోలింగ్ చేయాలి. అనంతరం తారు, కంకర మిక్సర్‌తో రోడ్డు వేయాలి. కానీ ఈ పనులు సక్రమంగా, నాణ్యతతో చేయకపోవడం వల్ల మూడు నెలలకే లోపాలు బయటపడ్డాయి. ఎక్కడిక్కడ తారు పొరలు లేచిపోయి, కింద వున్న మట్టి, గ్రావెల్ బయటకు వస్తున్నాయి. వీఎంఆర్‌డీఏ అధికారులు స్పందించి, పేదల ఇళ్ల కాలనీల్లో వేసిన బీటీ రహదారులకు క్వాలిటీ కంట్రోల్ అధికారులతో తనిఖీ చేయించాలని, నాణ్యతలోపాలతో రహదారులు నిర్మించిన కాంట్రాక్టర్, పర్యవేక్షించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయా కాలనీల ప్రజలు కోరుతున్నారు.

డ్రోన్‌తో వరి విత్తనాలు

... మిగతా 8వ పేజీలో

డ్రోన్ ద్వారా వరి విత్తనాలు వేసేందుకు నాలుగు నిమిషాలు పట్టింది. 15 సెంట్ల తడి (మాగాణి) నేలలో విత్తనాలు వేసేందుకు మూడు నిమిషాల పట్టింది. సెకనుకు 3.5 మీటర్ల వేగంతో డ్రోన్ విత్తనాలను వేయగలిగింది. డ్రోన్ సాయంతో ఒక ఎకరాకు ఎనిమిది కిలోల వరి విత్తనాలు సరిపోతాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. సాధారణ పద్ధతిలో (వెద చల్లడం లేదా నారుగా పెంచి పొలంలో నాటడం) అయితే ఎకరాకు 30-35 కిలోల విత్తనం అవసరం అవుతుంది. డ్రోన్ సాయంతో విత్తనాలు వేయడం వల్ల విత్తనం ఖర్చులో 73 శాతం ఆదా అవుతుంది. పైగా ఒక ఎకరా విస్తీర్ణంలో 15 నిమిషాల్లో విత్తనాలు వేయవచ్చు. హైదరాబాద్‌లోని మారుతి అనే డ్రోన్‌ల సంస్థ సాంకేతిక సహకారంతో అనకాపల్లి శాస్త్రవేత్తలు డాక్టర్ కె.వి.రామమూర్తి, డాక్టర్ గౌరి, డాక్టర్ జగన్నాథరావు ఈ పరిశోధలను చేపడుతున్నారు.

పూడిక తీసి.. తుప్పలు తొలగించి..

... 5వ పేజీ తరువాయి

దశకు చేరుకున్నాయి. రిజర్వాయర్ గరిష్ఠ నీటి మట్టం 460 అడుగులు కాగా సోమవారంనాటికి 451.02 అడుగులు వుంది. ఈ ఏడాది సర్పా నది పరివాహక ప్రాంతంలో ఆశించినంతగా వర్షాలు పడకపోవడంతో కల్యాణపులోవ రిజర్వాయర్‌లోకి నీరు సమృద్ధిగా చేరలేదు. ప్రస్తుతం ఉన్న నీరు 2,500 ఎకరాల మేర దమ్ము పనులకే సరిపోతుందని ఏఈ తెలిపారు. ఏటా ఆగస్టు ఐదు నుంచి పదో తేదీలోగా ఆయకట్టుకు నీటిని విడుదల చేసేవారమని, అయితే ఈ ఏడాది వరి ఆకు మడుల పోత ఆలస్యం కావడంతో నారు ఇంకా అందుబాటులోకి రాలేదన్నారు. రైతుల డిమాండ్ మేరకు ఆగస్టు 15వ తేదీ తరువాత ఆయకట్టుకు నీటిని విడుదల చేస్తామని ఆయన తెలిపారు.

క్రైం... crime news

పాత ఇనుము అమ్మకం పేరుతో మోసం

అనకాపల్లి టౌన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పాత ఇనుము అమ్మకం పేరుతో స్క్రాప్ వ్యాపారిని మోసగించి, ఆన్‌లైన్‌లో డబ్బులు తీసుకున్న వ్యక్తిపై సైబర్ నేరం కింద పోలీసులు కేసు నమోదు చేశారు. దీనికి సంబంధించి పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్ వెల్లడించిన వివరాలిలా వున్నాయి. పట్టణంలోని పూడిమడకరోడ్డులో కర్రి నాగేశ్వర్ అనే వ్యక్తి పాత ఇనుము వ్యాపారం చేస్తుంటాడు. ఏడాది ఏప్రిల్ ఎనిమిదో తేదీన గుర్తు తెలియని వ్యక్తి నుంచి ఫోన్ కాల్ వచ్చింది. తన వద్ద పెద్ద మొత్తంలో స్క్రాప్ ఇనుము ఉందని, విక్రయిస్తానంటూ వాట్సాప్ ద్వారా ఫొటోలు పంపాడు. తరువాత ఇద్దరి మధ్య బేరం కుదరడంతో అడ్వాన్సుగా రూ.2.5 లక్షలు ఆన్‌లైన్ పేమెంట్ చేయాలని గుర్తు తెలియని వ్యక్తి చెప్పాడు. దీంతో నాగేశ్వర్ ఆ మేరకు సొమ్మును ఆన్‌లైన్‌లో పంపాడు. ఇనుము తీసుకురావడానికి ఫోన్ చేస్తే.. ఆ వ్యక్తి స్పందించలేదు. పలుమార్లు ఫోన్లు చేసినప్పటికీ ఫలితం లేకపోవడంతో మోసపోయానని గ్రహించిన నాగేశ్వర్.. పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

ప్రయాణికులను తీసుకువెళుతున్న వ్యాన్ సీజ్



ప్రయాణికులను తీసుకెళుతున్న సరకు రవాణా వాహనాన్ని పట్టుకున్న పోలీసులు

అచ్యుతాపురం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులను తీసుకువెళుతున్న సరకు రవాణా వ్యాన్‌ను సీజ్ చేసినట్టు సీఐ నమ్మి గణేశ్ తెలిపారు. అచ్యుతాపురం జంక్షన్‌లో వాహనాల రద్దీ విపరీతంగా పెరిగిపోవడంతో నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తున్నది. దీనిని నివారించడానికి పోలీసులు దృష్టి సారించారు. ఈ సందర్భంగా వాహనాలను పరిశీలిస్తున్న పోలీసులు.. సోమవారం ఒక సరకు రవాణా వ్యాన్ (టాటా ఏస్)లో 27 మంది ప్రయాణికులను తీసుకెళుతుండగా అచ్యుతాపురం-ఎలమంచిలి రోడ్డులో పట్టుకున్నారు. రోలుగుంట నుంచి వ్యాన్‌లో బయలుదేరిన వీరు అచ్యుతాపురం మండలం పూడిమడక వద్ద సముద్ర స్నానాలు ఆచరించి, ఇళ్లకు తిరిగివెళున్నారు. వ్యాన్ డ్రైవర్ సేనాపతి వెంకట శ్రీనివాసరావును పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. అనంతరం ఎలమంచిలి కోర్టులో ప్రవేశపెట్టగా.. న్యాయమూర్తి రూ.2,500 జరిమానా విధించారని సీఐ తెలిపారు. సరకు రవాణ వాహనాల్లో ప్రయాణికులను తీసుకెళితే కేసు నమోదు చేస్తామని సీఐ స్పష్టం చేశారు.

60 కిలోల గంజాయి స్వాధీనం

- ముగ్గురి అరెస్టు



పట్టుబడిన గంజాయి, నిందితులతో సీఐ, ఎస్ఐలు

రోలుగుంట, జూలై 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్డిప జంక్షన్ వద్ద 60 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ముగ్గురిని అరెస్టు చేశామని సీఐ కోటేశ్వరరావు, ఎస్ఐ రామకృష్ణారావు తెలిపారు. దీనికి సంబంధించి వారు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. సోమవారం ఉదయం వడ్డిప జంక్షన్ వద్ద పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ముగ్గురు వ్యక్తులు ఆటోలో వస్తున్నారు. ఆటోను ఆపి తనిఖీ చేయగా గంజాయి లభ్యమైంది. 60 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని రత్నంపేటకు చెందిన పూడి రమణబాబు, ఆర్లి శ్రీను, చింతపల్లి మండలం మడిమబంద గ్రామానికి చెందిన కొర్రా సూరిబాబులను అరెస్టు చేశారు. వీరి నుంచి ఆటో, రెండు సెల్‌ఫోన్లను కూడా స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. నిందితులను రిమాండ్‌కు తరలించామన్నారు. వీరిలో పూడి రమణబాబుపై 2023లో ఒక గంజాయి కేసు, ఆర్లి శ్రీనుపై నాలుగు గంజాయి కేసులు ఉన్నాయని చెప్పారు.

రైలు ఢీకొని ట్రాక్ మన్ మృతి



కురందాసు అప్పారావు (ఫైల్ ఫొటో)

పాయకరావుపేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): గుల్లిపాడు- నర్సీపట్నం రోడ్ రైల్వే స్టేషన్ల మధ్య సోమవారం ఉదయం రైలు ఢీకొని ట్రాక్ మన్ ఒకరు అక్కడికక్కడే మృతిచెందాడు. ఇందుకు సంబంధించి తుని ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్ఐ జి.శ్రీనివాసరావు తెలిపిన వివరాలిలా వున్నాయి. ఎస్.రాయవరం మండలం పెట్టుగోళ్లపల్లి గ్రామానికి చెందిన కురందాసు అప్పారావు (57) రైల్వే ట్రాక్ మన్‌గా పని చేస్తున్నాడు. సోమవారం ఉదయం గుల్లిపాడు-నర్సీపట్నం రోడ్ రైల్వే స్టేషన్ల మధ్య ట్రాక్‌పై విధులు నిర్వహిస్తున్నాడు. ఈ సమయంలో గుంటూరు నుంచి రాయగడ వెళుతున్న ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సహచర ట్రాక్ మెన్ ఇచ్చిన సమాచారంతో తుని రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని తుని ఏరియా ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపిక



జిల్లా స్థాయి యోగా పోటీల్లో బంగారు పతకాలు సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

చోడవరం, జూలై 28(ఆంధ్రజ్యోతి): వచ్చే నెలలో కాకినాడలో యోగాసన భారత్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు స్థానిక యోగా క్రీడాకారులు ఎంపికయ్యారు. ఎంపికైన వారిలో ఒమ్మి శ్యాంప్రసాద్, పొట్నూరు పవన్‌కుమార్, గొంతిన లయవర్ధన్, పందిరి వెన్నెలశ్రీ, మళ్ల శ్రీహితలతో పాటు యోగా గురువు పుల్లేటి సతీశ్ ఉన్నారు. కాగా ఆదివారం జిల్లాలోని పరవాడలో నిర్వహించిన జిల్లా స్థాయి యోగాసన పోటీల్లో ఒమ్మి శ్యాంప్రసాద్ 14 ఏళ్లలోపు విభాగంలో బంగారు పతకం, 18 ఏళ్ల విభాగంలో పొట్నూరు పవన్, బ్యాక్ బెండింగ్ విభాగంలో గొంతిన లయవర్ధన్‌లు బంగారు పతకాలు సాధించారు. 18 ఏళ్లలోపు బాలికల విభాగంలో పందిరి వెన్నెలశ్రీ బంగారు పతకం సాధించగా, 28 సంవత్సరాల విభాగంలో మళ్ల శ్రీహిత బంగారు పతకం, 45ఏళ్లలోపు విభాగంలో పతంజలి యోగా కేంద్రం గురువు పుల్లేటి సతీశ్ బంగారు పతకాలు సాధించి సత్తాచాటారు. జిల్లా స్థాయి పోటీల్లో బంగారు పతకాలు సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన స్థానిక యోగా క్రీడాకారులను పలువురు అభినందించారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	87.00
లైవ్ ధర	107.00
విత్ స్కిన్	184.00
స్కిన్ లెస్	194.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	450
విజయనగరం	454
శ్రీకాకుళం	454